TGTEL/26/A0320

# భారతీయ వెలుగు

జాతీయ తెలుగు దిన పత్రిక




బుధవారం ఫిబ్రవరి 4, 2026 | సంపుటి :01 | సంచిక :19 | రంగారెడ్డి | గున్నాల లావణ్య | పేజీలు -12 | వెల-5

Hyderabad,KarimNagar, Warangal, Khammam, Nalgonda, Mahabub Nagar, Nizamabad, Gadwal, Medak, Vikarabad, Wanaparthy, Siddipet,

# మన సహనమే విజయానికి బాట



- విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం
- అదే ఇప్పుడు మనలను ముందకు తీసుకెళ్లింది
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ
- ఎన్‌డిఎ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపిలు

ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు.భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. 2లో..

## బుల్ బుల్లెట్ పరుగు..

### మదుపర్ల సంపద 12 లక్షల కోట్లు పైకి



ముంబయి: చాలా రోజుల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఎన్నాళ్లగానో వేచి చూస్తున్న అమెరికాతో ట్రేడ్ డీల్‌పై స్పష్టత రావడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్ రంకెలేసింది. ఉదయం మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి చివరి వరకు బుల్లెట్‌లా బుల్ రన్ కొనసాగింది. 2లో..

## చట్టాలను పాటించకపోతే..

### దేశం నుంచి వెళ్లిపోండి: మెటాపై సుప్రీం ఆగ్రహం




దిల్లీ: ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటా పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చు' అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. 2లో..

## ఎయిరిండియా డ్రీమ్‌లైనర్‌కు తప్పిన ప్రమాదం

**ఇంధన స్విచ్‌లో లోపాన్ని గుర్తించిన పైలట్**

**బెంగళూరులో నిలిపివేత**



దిల్లీ: ఎయిరిండియా బోయింగ్ 787-8 విమానం ఇంధన నియంత్రణ వ్యవస్థలో లోపం ఉందని పైలట్ గుర్తించడంతో అది బెంగళూరులో దిగిన వెంటనే క్షుణ్నంగా తనిఖీలు చేపట్టారు. ఈ విమానం 200 మందికి పైగా ప్రయాణికులతో లండన్‌లోని హీత్రూ నుంచి సోమవారం ఉదయం బెంగళూరుకు చేరుకుంది. విమానం ఎడమవైపు ఇంజిన్ 'రన్' నుంచి 'కటాఫ్'కు మారిపోయిందని, దానిని లాక్ చేయడం వీలు కావడం లేదని పైలట్ సమాచారం ఇచ్చారు. 2లో..

## అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి: పవన్‌కల్యాణ్



అమరావతి: మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు అందాయని తెలిపారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. దీనివల్ల ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తుందన్నారు. ఎక్సైజ్ అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని.. అధిక ధరలకు విక్రయాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు.

## రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ హామీ

### రోడ్డు ప్రమాదాలను నివారించేలా అవగాహన

### ప్రతిజ్ఞ వెబ్‌సైట్ ప్రారంభంలో మంత్రి పొన్నం ప్రభాకర్



రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారు. ఇది తెలంగాణలో బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. పౌరులు, తల్లిదండ్రులను రోడ్డు భద్రతకు స్పృహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యత అని సురక్షితమైన అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమై ప్రతి రహదారిపై కొనసాగుతాయని గుర్తించడం రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు వినియోగదారులలో క్రమశిక్షణ, అవగాహన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రోత్సహించే దార్శనికతను పునరుద్ఘాటించారు. పౌరులు ట్రాఫిక్ నియమాలను పాటించడానికి మరియు రోడ్డుపై ఉన్న ప్రతి జీవితాన్ని గౌరవించడానికి పౌర ప్రతిజ్ఞను తీసుకోవచ్చు, తల్లిదండ్రులు తల్లిదండ్రుల ప్రతిజ్ఞను ఉదాహరణగా తీసుకొని, పిల్లలలో సురక్షితమైన అలవాట్లను రూపొందించవచ్చు. 2లో..

## మేడారం జాతర విజయవంతం

**ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాల్లో పనిచేస్తాం**


**ఎక్కడా అవాంఛనీయ ఘటనలు లేకుండా జాతర పూర్తి**

**మీడియాతో ఇష్టాగోష్టిలో మంత్రి సీతక్క**



ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంత మైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఇదే స్ఫూర్తితో గోదావరి పుష్కరాలను కూడా రేవంత్ ప్రభుత్వం విజయవంతం చేస్తుందని అన్నారు. మంగళవారం సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. 2లో..

## మున్సిపల్ ఎన్నికలు.. టికెట్ల కేటాయింపుపై మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అసంతృప్తి



జగిత్యాల: మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ టికెట్ల కేటాయింపుపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపాలిటీలో టికెట్ల కేటాయింపుపై ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి ఎక్కువ టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. ఆయన వర్గానికి 30, తన వర్గానికి 20 టికెట్లు ఇచ్చారన్నారు. ఈ చర్యతో తన మెడ కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నేతలు పెద్ద సంఖ్యలో జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకుంటున్నారు.

## తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీంకోర్టు స్పష్టత



దిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. 2లో..

## ఉచితాల కోసమే బడ్జెట్ అన్నట్లుగా తప్పుడు ప్రచారం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. 2లో..

## కడియం శ్రీహరి అనర్హత పిటిషన్‌పై రేపు విచారణ

హైదరాబాద్: ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు విచారణ జరగనుంది. పిటిషనర్ కేపీ వివేకానందగౌడ్ వాదనలు స్పీకర్ నమోదు చేయనున్నారు.



# సంపాదకీయం

## పీఎస్‌యూల పునరుజ్జీవనానికి కొత్త స్ఫూర్తి

దేశంలో అతిపెద్ద కోకింగ్ కోల్ ఉత్పత్తిదారు, కోలిండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఈ సంవత్సరం జనవరి 19న ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయింది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్ పరిస్థితులు ఆశాజనకంగా లేనప్పటికీ ఈ సంస్థ ఐపీఓ చరిత్ర సృష్టించింది. రూ.1,070 కోట్లను సేకరించడానికి ఆఫర్‌లో ఉన్న 46 కోట్ల షేర్ల కోసం 147 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. 90 లక్షలకు పైగా అప్లికేషన్లు దాఖలయ్యాయి. భారత ప్రభుత్వరంగ సంస్థల విజయవంతమైన ఐపీఓ లిస్టింగ్ ఇదొక్కటే కాదు. ఈ ఒరవడి గత కొన్నేళ్లుగా ఇలాగే స్థిరంగా కొనసాగుతోంది. గత 7--8 సంవత్సరాల కాలంలో దాదాపు 15 ప్రభుత్వరంగ సంస్థలు భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అవడంతోపాటు అవసరమైన మూలధనాన్ని సేకరించగలిగాయి. వాటాదారుల షేర్ల విలువను పెంచడంతో పాటు రిటైలర్ల సంపదను కూడా సృష్టించగలిగాయి. 2017 నుంచి, భారతదేశంలో ఇంజనీరింగ్, నిర్మాణం, రైల్వే, రక్షణ, ఇంధన సంబంధిత రంగాలలో 10కి పైగా అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థలు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యాయి. తద్వారా, దిగువ పేర్కొన్న కంపెనీలలో, మూలధన మార్కెట్ విలువ రూ. 1.40 లక్షల కోట్ల నుంచి రూ. 8.53 లక్షల కోట్లకు పెరిగింది-- ఇది 513 శాతం భారీ పెరుగుదల.

ఆగస్టు, 2017లో రూ.7,096 కోట్లతో లిస్టింగ్ అయిన కొచ్చిన్ షిప్‌యార్డ్ మార్కెట్ మూలధనం 31 డిసెంబర్, 2025 నాటికి రూ.42,634 కోట్లకు (501 శాతం) పెరిగింది. అక్టోబర్, 2020లో రూ.3,489 కోట్లతో లిస్టింగ్ అయిన మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ మార్కెట్ మూలధనం 31 డిసెంబర్, 2025 నాటికి ఏకంగా రూ.1,00,000 కోట్లకు (అంటే 2,766శాతం!) పెరిగింది. అదేవిధంగా, జూలై, 2018లో రూ.4,254 కోట్లతో లిస్టింగ్ అయిన =xుజూ లిమిటెడ్ మార్కెట్ మూలధనం రూ. 11,652 కోట్లకు (174శాతం) పెరిగింది. x=జూచీ ఇంటర్నేషనల్ సెప్టెంబర్, 2018లో రూ.3,919 కోట్ల నుంచి రూ.16,704 కోట్ల (326 శాతం)కు పెరిగింది. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఏప్రిల్, 2019లో రూ.3,972 కోట్ల నుంచి రూ.74,508 కోట్లకు (1,776శాతం) పెరిగింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ జనవరి, 2021లో రూ.32,475 కోట్ల నుంచి రూ.1,63,000 కోట్లకు (402శాతం) పెరిగింది. అంతేగాక, ఇండియన్ రైల్వే క్యాటరింగ్ �„ టూరిజం కార్పొరేషన్-- అక్టోబర్, 2019లో రూ.11,658 కోట్ల నుంచి రూ.54,764 కోట్లకు (370శాతం), రైల్ టెల్ కార్పొరేషన్ (ఫిబ్రవరి, 2021) రూ.3,896 కోట్ల నుంచి రూ.11,924 కోట్లకు (206శాతం), హౌసింగ్ �„ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (మే, 2017) రూ.14,514 కోట్ల నుంచి రూ.45,683 కోట్లకు (215 శాతం), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (మార్చి, 2018) రూ.37,731 కోట్ల నుంచి రూ.2,93,000 కోట్లకు (676శాతం), ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (నవంబర్, 2023) రూ.16,124 కోట్ల నుంచి రూ.39,301 కోట్లకు (144శాతం) పెరిగింది. ఈ పీఎస్‌యూలు అన్నీ మొత్తంగా తమ మూలధన మార్కెట్ విలువను రూ.1,39,128 కోట్ల నుంచి రూ. 8,53,170 కోట్లకు (అంటే దాదాపు 513 శాతానికి) పెంచుకున్నాయి. భారీ పెరుగుదల ఇది.

గతంలో, ప్రభుత్వరంగ సంస్థలు మూలధన పెట్టుబడులు, ఇతర విస్తరణ పనుల కోసం సంబంధిత మంత్రిత్వ శాఖల బడ్జెట్ కేటాయింపులపై ఆధారపడాల్సి వచ్చేది. దీనికోసం ఆయా మంత్రిత్వ శాఖల్లో వివిధ విభాగాలతో విస్తృతమైన చర్చలు జరపాల్సి రావడమే కాకుండా నిధులను విడుదల చేయించుకోవడానికి చాలా సమయం పట్టేది. నేడు నిర్ణయాలు అమలు చేయడంలో ఎంతో వేగాన్ని ప్రదర్శిస్తున్న ఈ సంస్థలు నిధుల కోసం ఎదురుచూసే స్థితి నుంచి.. ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు నిధులు సమకూర్చే స్థాయికి ఎదిగాయి. గత పరిస్థితులతో పోలిస్తే ఇది రివర్స్ ట్రెండ్.

ఉదాహరణకు, క్రిటికల్ మినరల్స్ రంగంలో భారతదేశ దీర్ఘకాల అవసరాల దృష్ట్యా స్థిరమైన సప్లయ్ చైన్‌ను బలోపేతం చేసేందుకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ జనవరి 2025లో 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించింది. దీని కోసం రూ.34,300 కోట్ల అంచనా వ్యయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. అందులో రూ. 1,500 కోట్లు మాత్రమే బడ్జెట్ నుంచి లభిస్తున్నాయి. వివిధ మంత్రిత్వ శాఖల విభాగాల సంపూర్ణ సమన్వయం విధానంతో కేంద్ర ప్రభుత్వం సమకూర్చే ఇతర పెద్ద మొత్తాన్ని అటుంచితే, 50శాతానికి పైగా నిధులు అంటే.. రూ.18,000 కోట్లు వివిధ మంత్రిత్వ శాఖల పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థలు సమకూరుస్తున్నాయి. వీటిలో గనుల మంత్రిత్వ శాఖ నుంచి ఖూాదీxూ, బొగ్గు శాఖ నుంచి కోలిండియా లిమిటెడ్, నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్, ఉక్కు శాఖ నుంచి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ నుంచి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, పెట్రోలియం శాఖ నుంచి ఆయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ వంటివి ఉన్నాయి. రానున్న రోజుల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, సంబంధిత సాంకేతికతను మెరుగుపరిచేందుకు ఈ సంస్థల నుంచి సేకరించే పెట్టుబడులను ఉపయోగిస్తారు. ఎన్‌సీఎమ్‌ఎమ్ కోసం పీఎస్‌యూల నుంచి పెట్టుబడులను తీసుకొచ్చిన ఈ వ్యూహాత్మక విధానం రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టే వివిధ కీలకమైన కార్యక్రమాలకు అవసరమైన నిధులను సమకూర్చేలా.. కేంద్ర ప్రభుత్వానికి ఒక మంచి అవకాశం అందించింది. చాలా వరకు మార్కెట్లు స్థిరమైన పెట్టుబడులు కొనసాగించిన వాటాదారులకు మాత్రమే మంచి లాభాలను అందిస్తాయి. బీసీసీఎల్ విషయానికి వస్తే.. నష్టాల్లో ఉన్న పీఎస్‌యూగా ముద్రపడటం నుంచి మొదలుపెట్టి.. వ్యాల్యూ-- డ్రివెన్ వ్యవస్థగా, వ్యూహాత్మకంగా కీలకమైన సంస్థగా మారడం వరకు అది సాగించిన ప్రయాణం మనందరికీ తెలుసు. ఇవాళ ఈ సంస్థకు భారతదేశ డొమెస్టిక్ కోకింగ్ కోల్ ఉత్పత్తిలో 58.5శాతం వాటా ఉంది. దీంతో కీలకమైన ఉక్కు, మౌలిక సదుపాయాల రంగంలో ఇది అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తోంది.

## తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై సుప్రీంకోర్టు స్పష్టత

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.

## ఎయిరిండియా డ్రీమ్‌లైనర్‌కు తప్పిన ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

ప్రాథమిక సమాచారం ఆధారంగా విమానాన్ని నిలిపివేసి, ఆ లోపాన్ని అత్యవసరంగా సరిచేయాల్సిందిగా తయారీదారుల్ని కోరామని ఎయిరిండియా తెలిపింది. ఈ విషయాన్ని పౌరవిమానయాన శాఖకు, డీజీసీయేకు తెలియజేశామని వెల్లడించింది. అన్ని బోయింగ్ 787 విమానాల ఇంధన నియంత్రణ స్విచ్‌లను తనిఖీ చేశామని, అవి బాగానే ఉన్నాయని తెలిపింది. గత ఏడాది జూన్ 12న అహ్మదాబాద్‌లో ఇదే సంస్థకు చెందిన ఇదే రకం విమానం.. టేకాఫ్ సమయంలో ఇంధన సరఫరా ఆగిపోయి కూలిపోవడంతో 260 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజా ఘటనలోనూ విమానం బయల్దేరినచోటే సమస్య తలెత్తినట్లు భారత పైలట్ల సమాఖ్య (ఎఫ్ఐపీ) చెబుతోంది. దానివల్ల విమానం గాలిలో ఉంటుండగా ఇంజిన్ ఆగిపోయే ప్రమాదం సంభవించవచ్చని తెలిపింది.„

## రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ హామీ

మొదటి పేజీ తరువాయి

ఈ చౌరవ రోడ్డు భద్రత అంటే కేవలం అమలు మాత్రమే కాదని, కుటుంబాలు, పిల్లలు మరియు తెలంగాణలోని ప్రతి తోటి పౌరుడికి సమిష్టి వాగ్దానం అని గుర్తు చేస్తుంది. ఇది రోడ్డు భద్రతకు ప్రభుత్వం యొక్క బలమైన సంస్థాగత నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..విద్యార్థులకు తల్లిదండ్రులతో ఉన్న బంధాన్ని రవాణా శాఖ రోడ్డు భద్రతకు ఉపయోగించుకోవడానికి ఈరోజు రవాణా శాఖ రోడ్డు భద్రత ప్రతిజ్ఞా వెబ్‌సైట్ ప్రారంభించిందిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రతిజ్ఞ రాబోయే కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించి కారణాలు రక్షించడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర అగ్రిమెంట్ ద్వారా విద్యార్థులతో ఉన్న వారి బాండింగ్ తో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆకాక్షించారు. ఇది ఆ÷-లనైన్ లో క్షేత్ర స్థాయిలో ప్రతి మోటార్ వెహికిల్ ఉన్న వారి దగ్గరకు తీసుకుపోయి రవాణా శాఖ అధికారులు పెద్ద ఉద్యమంలో తీసుకుపోవాలి. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్ పె÷-టటెం తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతర విజయవంతం

మొదటి పేజీ తరువాయి

ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మేడారం మహాజాతర అత్యంత వైభవంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముగియడంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గత జాతరల కంటే మెరుగైన ఏర్పాట్లు చేశామని, అమ్మవార్ల ఆశీస్సులతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఆమె కొనియాడారు. ఈ ఏడాది జాతర అంచనాలకు మించి జరిగిందని మంత్రి తెలిపారు. క్లాస్, మాస్ అనే తేడా లేకుండా హైక్లాస్ పీపుల్ కూడా భారీ సంఖ్యలో తరలివచ్చారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో 'తిరుగు జాతర' నిర్వహణతో ఈ వేడుకలు పూర్తిస్థాయిలో ముగుస్తాయని వెల్లడించారు. జాతర ఏర్పాట్లపై కొంతమంది కావాలనే విష ప్రచారం చేశారని సీతక్క మండిపడ్డారు. ముఖ్యంగా ఒక చిన్న దొంగతనం ఘటనను భూతద్దంలో చూపిస్తూ, జాతర ఏర్పాట్లు విఫలమయ్యాయనే రీతిలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులను గమనించిన ప్రతిపక్ష నాయకులు సైతం ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించడం సంతోషకరమని ఆమె అన్నారు. జాతరలో మంత్రి సీతక్క చేసిన నృత్యంపై వచ్చిన వ్యాఖ్యలకు ఆమె దీటుగా సమాధానమిచ్చారు. మా ఆదివాసీ సంస్కృతిలో నృత్యం అనేది ఒక భాగం. విదేశాల నుంచి వచ్చేవారు కూడా మా నృత్యాలను ఇష్టపడి చేస్తున్నారు. అలాంటప్పుడు మా సొంత గడ్డపై, మా సంస్కృతిలో భాగంగా నేను నృత్యం చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఇది తన మూలాలకు, ప్రజలకు ఇచ్చే గౌరవమని స్పష్టం చేశారు. వచ్చే జాతర నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం చుట్టుపక్కల ఉన్న రోడ్లను వెడల్పు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే, త్వరలో రాబోయే గోదావరి పుష్కరాల గురించి ములుగు జిల్లా పరిధిలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

## తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలేది లేదు

మొదటి పేజీ తరువాయి

### కేబినేట్‌కు ముందు ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు భేటీ



తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక భేటీ నిర్వహించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 'తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ కోణం చూడటం లేదు. ఇది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావాల్సిన అంశం కాదు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రతకు సంబంధించిన అంశం. ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని సహచర నేతలకు వివరించారు. ఈ కుట్ర వెనుక ఉన్న నిందితులను నిగ్గుతేల్చేందుకే విచారణ కమిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని ఆయన చంద్రబాబుకు స్పష్టం చేశారు. పవిత్రమైన ఆలయ ప్రాభవాన్ని దెబ్బతీసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. బీజేపీ తరపున మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ విషయంలో కూటమిలో పూర్తి ఏకాభిప్రాయం ఉందని తెలిపారు. వైసీపీ హయాంలో జరిగిన ఈ కుట్రలను ప్రజల ముందు పెట్టి, క్షేత్రస్థాయిలో వారిని ఎండగట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక భేటీలో కూటమిలోని ముఖ్య నేతలు పాల్గొన్నారు.. నాదెండ్ల మనోహర్, నారా లోకేష్, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ కూడా పాల్గొన్నారు. తిరుమల ఆలయ పవిత్రత, ప్రసాదాల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, దోషులను విచారణ ద్వారా బహిర్గతం చేస్తామని కూటమి నేతలు ముక్తకంఠంతో తీర్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలోని 1వ బ్లాక్ లో రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను క్యాబినెట్ తీసుకుంది.

# మన సహనమే విజయానికి బాట

మొదటి పేజీ తరువాయి

మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

## బుల్ బుల్లెట్ పరుగు..

### మదుపర్ల సంపద 12 లక్షల కోట్లు పైకి

మొదటి పేజీ తరువాయి

ఫలితంగా సెన్సెక్స్ 2 వేల పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,700 ఎగువకు చేరింది. అన్ని రంగాల స్టాక్స్ లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.12 లక్షల కోట్లు పెరిగి రూ.467.35 లక్షల కోట్లకు చేరింది.

భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం రాత్రి ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికా దిగుమతులపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం సుంకాలు 18 శాతానికి దిగి రానున్నాయి. ఈ ప్రకటన స్టాక్ మార్కెట్ సూచీలకు కొత్త బూస్ట్ ఇచ్చింది.

బుల్ పరుగు ఇలా: ట్రంప్ ప్రకటన నేపథ్యంలో సెన్సెక్స్ ఆరంభంలోనే దాదాపు 3600 పాయింట్ల లాభంతో 85,323.20 వద్ద (క్రితం ముగింపు 81,666.46) ప్రారంభమైంది. ఓ దశలో 4 వేలకు పాయింట్ల లాభంతో 85,871.73 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2072.67 పాయింట్ల లాభంతో 83,739.13 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 26,341.20 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 639.15 పాయింట్ల లాభంతో 25,727.55 వద్ద స్థిరపడింది.

కోలుకున్న రూపాయి: దేశీయ కరెన్సీ రూపాయి కూడా కోలుకుంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం 91.51గా ఉండగా.. ట్రేడ్ డీల్ నేపథ్యంలో ఒక్కరోజులోనే 1.36 శాతం బలపడి 90.26కి చేరింది. రూపాయి విలువ ఈ స్థాయిలో బలపడడం ఇదే తొలిసారి.

ఆ రెండూ మినహా: సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్ (9.12 శాతం), బజాజ్ ఫైనాన్స్ (6.68 శాతం), ఇండిగో (5.51 శాతం), పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (283.25), సన్‌ఫార్మా (4.54) చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4921 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## చట్టాలను పాటించకపోతే..

మొదటి పేజీ తరువాయి

దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.

ఏమిటీ ప్రైవసీ పాలసీ?

2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

## ఉచితాల కోసమే బడ్జెట్ అన్నట్లుగా తప్పుడు ప్రచారం: కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఆ పథకానికి బడ్జెట్‌లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు.

ప్రతి జిల్లాకూ బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందన్నారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు.

భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
బుధవారం ఫిబ్రవరి 4, 2026

# భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌లో కీలక వ్యక్తి.. ఎవరీ సెర్గియో గోర్

- వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ప్రముఖంగా వినిపిస్తున్న సెర్గియో గోర్ పేరు
- సంక్లిష్ట పరిస్థితుల్లో రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో గోర్
- ట్రంప్‌నకు మంచి సన్నిహితుడిగా ఉన్న సెర్గియో గోర్



**భారతీయ వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ**
భారతదేశం, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ద్వైపాక్షిక ఒప్పందం ఇరుదేశాలకు సంబంధించి ప్రధాన దౌత్య విజయంగా పేర్కొంటున్నారు. వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో భారత్‌లో అమెరికా దౌత్యవేత్త సెర్గియో గోర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జనవరిలోనే రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో గోర్ ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య బంధాన్ని మరోస్థాయికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని వెల్లడించారు.
రష్యా నుంచి చమురు కొనుగోలు వంటి వివిధ అంశాల కారణంగా ఒకవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై అదనపు సుంకాలు విధించారు. ఇలాంటి సంక్లిష్ట వాతావరణంలో భారత్ లో రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో వాణిజ్య ఒప్పందంలో కీలక పాత్ర పోషించారు. అమెరికా, భారత్ మధ్య బలమైన స్నేహం వల్లే ఈ ఒప్పందానికి అంగీకారం లభించిందని, ఇప్పటి నుంచి రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని సెర్గియో అన్నారు.
సెర్గియో గోర్ కుటుంబం అమెరికాకు 1990లలో వలస వచ్చింది. ఆయన తల్లిదండ్రులవి రష్యా మూలాలు. అమెరికా వచ్చిన కొంతకాలానికే గోర్‌కు పౌరసత్వం లభించింది. 2008లో పొలిటికల్ సైన్స్, అంతర్జాతీయ వ్యవహారాల్లో పట్టా పొందారు. మొదటి నుంచి ఆయన రిపబ్లికన్ పార్టీతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. 2020లో ట్రంప్ హయాంలో విక్టరీ ఫైనాన్స్ కమిటీకి చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమితులయ్యారు.
నాటి నుంచి ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు. భారత్‌కు రాయబారిగా కంటే ముందు, శ్వేతసౌధంలో పర్సనల్ డైరెక్టర్‌గా పని చేశారు. ట్రంప్ రాజకీయ అజెండాకు తగినట్లు నిర్ణయాలు అమలు చేస్తారు. వాణిజ్య ఒప్పందానికి కొన్ని రోజుల ముందు గోర్ మాట్లాడుతూ, ట్రంప్, మోదీల మధ్య నిజమైన స్నేహబంధం ఉందని, అమెరికాకు భారత్ తర్వాతే ఎవరైనా అని పేర్కొన్నారు.

# ఏపీలో రాష్ట్రపతి పాలన విధించండి:

- పార్లమెంటు వద్ద వైసీపీ ఎంపీల నిరసన
- ప్లకార్డులు చేతపట్టి ఆందోళనకు దిగిన వైసీపీ ఎంపీలు
- ఏపీలో ఆటవిక పాలన కొనసాగుతోందని నినాదాలు
- కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్



**భారతీయ వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ**
పార్లమెంట్ ఎదుట వైసీపీ ఎంపీలు ప్లకార్డులు చేతపట్టి ఆందోళనకు దిగారు. ఏపీలో ఆటవిక పాలన కొనసాగుతోందని వారు నినాదాలు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని... అవసరమైతే ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు.
మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ల నివాసాలపై దాడుల నేపథ్యంలో వైసీపీ ఎంపీలు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే కేంద్ర హోం శాఖ కార్యదర్శిని కలిసి పరిస్థితిని వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కూడా కలిసి పరిస్థితులను ఆయనకు వివరించాలని వైసీపీ భావిస్తోంది.

# అది మోదీ మాస్టర్ క్లాస్

- భారత్-అమెరికా ఒప్పందంపై జేపీ ప్రశంసలు
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీకి జేపీ అభినందనలు
- సవాళ్లను ఎదుర్కోవడంలో మోదీది ఒక మాస్టర్ క్లాస్
- ఇరు దేశాల బంధం మరింత పటిష్టమవుతుందని
- అసంపూర్తి ఎజెండాపై దేశం దృష్టి సారించాలని పిలుపునిచ్చిన జేపీ



**భారతీయ వెలుగు ప్రతినిధి హైదరాబాద్**
భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశానికి గొప్ప శుభవార్త అని పేర్కొంటూ, ఈ విజయం సాధించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. క్లిష్టమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ, ప్రధాని మోదీ ఎంతో సంయమనంతో వ్యవహరించి జాతీయ ప్రయోజనాలను కాపాడారని ఆయన ప్రశంసించారు.
ఈ ఒప్పందంపై జేపీ స్పందిస్తూ, "తీవ్రమైన సవాళ్ల నడుమ జాతీయ ప్రయోజనాలను ప్రోత్సహించడం, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థతో స్నేహాన్ని కాపాడుకోవడం, అదే సమయంలో జాతీయ గౌరవాన్ని నిలబెట్టడం వంటి అంశాలలో ప్రధాని మోదీ ఒక మాస్టర్ క్లాస్ ప్రదర్శించారు" అని కొనియాడారు. భారత్, అమెరికా దేశాలు సహజ మిత్రపక్షాలని, ఈ వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.
ఈ ఒప్పందంతో వచ్చిన నూతనోత్సాహంతో దేశం సమ్మిళిత ఆర్థిక వృద్ధి, శ్రేయస్సు దిశగా మరింత పటిష్టంగా ముందుకు సాగవచ్చని జేపీ ఆకాంక్షించారు. ఇకపై ఒక దేశంగా మనమంతా అసంపూర్తిగా మిగిలిపోయిన ఎజెండాపై దృష్టి సారించి, అభివృద్ధి పథంలో పయనించాలని ఆయన పిలుపునిచ్చారు.

# సహనమే భారత్ ను గెలిపించిందన్న మోదీ

- అమెరికాతో ట్రేడ్ డీల్ పై స్పందించిన ప్రధాని
- ఎన్ని విమర్శలు వచ్చినా సహనంతో ఉన్నామని వెల్లడి
- వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇదే నిదర్శనమని వ్యాఖ్య



**భారతీయుడు వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ**
విదేశాలతో వాణిజ్య చర్చలకు సంబంధించి ప్రభుత్వం స్థిరమైన వైఖరితో ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమెరికాతో చారిత్రాత్మక ట్రేడ్ డీల్ కుదిరిన సందర్భంగా ఎన్డీయే కూటమి సమావేశంలో మోదీ మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ లు విధించడంపై ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. సుంకాల విషయంలో తమ ప్రభుత్వాన్ని విమర్శలు చుట్టుముట్టాయని గుర్తుచేసుకున్నారు.అయితే, ప్రభుత్వం మాత్రం సహనంతో వేచి ఉందని, దాని ఫలితం ఈ రోజు అందరూ చూస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా కుదిరిన ట్రేడ్ డీల్ తో అనుకూల ఆర్థిక వాతావరణం నెలకొందన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# జనం గుండెల్లో పెట్టుకుంటేనే జాతిపిత -- రుద్దితే కాదు!

**భారతీయ వెలుగు బ్యూరో హైదరాబాద్**
తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు జాతిపిత వివాదం నడుస్తోంది. తెలంగాణ జాతిపితగా కేసీఆర్ ను నిలబెట్టేందుకు బీఆర్ఎస్ ప్రచార ఉద్యమం చేస్తోంది. తెలంగాణ జాతిపితకు ఫోన్ ట్యాపింగ్ నోటీసులు ఇస్తారా అని ప్రశ్నిస్తోంది. దీనికి రేవంత్ రెడ్డి సెటైరికల్ గా కౌంటర్ ఇచ్చారు. ఆయన గాంధీ దేశం కోసం సర్వం త్యాగం చేయడం వల్ల ఆయనను ప్రజలు జాతిపితగా గుర్తుపెట్టుకున్నారని.. కానీ కేసీఆర్ ప్రజల్ని దోచుకుని వేల కోట్లు ఆస్తులు దోచుకుని, తెలంగాణని సొంత ఆస్తిలా భావించి పదవులన్నీ కుటుంబసభ్యులకు ఇచ్చుకున్నడాని అలాంటి వారు జాతిపిత ఎలా అవుతారని ప్రశ్నించారు. దీనికీ బీఆర్ఎస్ కౌంటర్ ఇస్తుంది. ఈ చర్చ ఇలా సాగుతుంది. కానీ కేసీఆర్ జాతిపిత అని ప్రచారం చేసుకోవడం మాత్రం ఎబ్బెట్టుగానే మారింది.



### సామాన్య జనం హృదయాల నుంచి రావాలి !

తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని సామాన్య తెలంగాణ ప్రజల గుండెల్లో నుంచి వస్తే..దాన్ని రేవంత్ కాదు కదా ఎవరూ ఆపలేరు. కానీ అలాంటి నినాదం అక్కడి నుంచి రాలేదు. బీఆర్ఎస్ చేయాలని అనుకుంటోంది. కానీ ప్రజలు తమ జాతిపితగా భావించాలంటే.. వచ్చిన కొన్ని అవకాశాల్ని కేసీఆర్ వదిలేసుకున్నారు. దళిత ముఖ్యమంత్రి దగ్గర నుంచి ... తెలంగాణ సాధించాక తాను , తన కుటుంబం అధికారం చేపట్టదని చేసిన ప్రకటనల వరకూ అన్నింటినీ మర్చిపోయారు. పదేళ్ల పాటు తెలంగాణ మొత్తాన్ని గుప్పిట పట్టుకున్నారు. ఈ క్రమంలో ఆయనపై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. ఆయన కుటుంబసభ్యులపై వచ్చాయి. ఇవన్నీ ఆయన ఇమేజ్‌ను దిగజార్చాయి.

### తెలంగాణ క్రెడిట్ కేసీఆర్ ఒక్కరికే ఇవ్వడానికి సిద్ధంగా లేని సమాజం

తెలంగాణ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే తెలంగాణ అని చెప్పుకునే రోజుల్లో కూడా తెలంగాణ జాతిపిత అని ఎవరూ పిలవలేదు. తెలంగాణ సాధించిన క్రెడిట్ కూడా ఆయన ఒక్కరికే ఇవ్వడానికి సిద్ధపడలేదు. నిజానికి కేసీఆర్ తెలంగాణ కోసం ఉపఎన్నికల రాజకీయాలు చేశారు కానీ.. ఉద్యమం కోసం ఎప్పుడూ రోడ్డెక్కలేదు. రాజకీయ పోరాటాన్ని ప్రజలు గుర్తించారు. అధికారం ఇచ్చారు.కానీ తెలంగాణ ఆయన వల్లే వచ్చిందని మాత్రం.. తెలంగాణ ప్రజలు అనుకోవడం లేదు. ఆ విషయం తెలంగాణ వచ్చిన వెంటనే జరిగిన ఎన్నికల్లో చాలా స్వల్పంగా అత్తెసరు మెజార్టీతో గెలవడమే కారణం. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్లు రావడం గగనంగా మారింది.

### పదేళ్ల పాలన మరింత మైనస్

తెలంగాణ జాతిపితగా .. తెలంగాణ సమాజం గుర్తించేలా కేసీఆర్ వ్యవహారం లేదనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తెలంగాణ ఉద్యమ క్రెడిట్ అంతా ఆయన తీసుకునే ప్రయత్నం చేసినా.. కళ్ల ముందు లక్షల మంది ఉద్యమకారులు ఉండటంతో ప్రజలు కూడా అలా అనుకోవడంలేదు. అదే సమయంలో రేవంత్ చెప్పినట్లుగా ఉద్యమకారుల్ని కూడా ఆయన హయాంలో ఘోరమైన అవమానాలకు గురి చేశారు. ఎలా చూసినా .. తెలంగాణ జాతిపిత అని బీఆర్ఎస్ రుద్దుతోంది కానీ.. ప్రజలు భావించడం లేదు. బీఆర్ఎస్ పితగా మాత్రం ఆయన స్థానం ఇప్పటికి బలంగా ఉంటుందని అనుకోవచ్చు. కాదు ఆయన తెలంగాణకే పిత అని రుద్దే ప్రయత్నం చేస్తే అది కూడా ప్రజల్లో వ్యతిరేకతకు కారణం అయ్యే ప్రమాదం ఉంది.

# 2029లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం: అనిల్ కుమార్ యాదవ్

- మరో మూడేళ్లు ఆటవిక పాలన భరిస్తామని వ్యాఖ్య
- సీఎం, డిప్యూటీ సీఎం ఫ్రస్ట్రేషన్ లో ఉన్నారన్న అనిల్



**భారతీయ వెలుగు ప్రతినిధి నెల్లూరు**
వైసీపీ నేతలపై దాడులకు పాల్పడుతూ కూటమి నేతలు ఆటవిక పాలనకు తెరలేపారని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఏపీని రావణకాష్ఠంగా మార్చారని మండిపడ్డారు. మరో మూడేళ్ల పాటు ఆటవిక పాలనను భరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 2029లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని అన్నారు.
కాపు, బీసీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని అనిల్ విమర్శించారు. తిరుమల లడ్డూ గురించి దుష్ప్రచారం చేసి అడ్డంగా దొరికేశారని... దాన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైసీపీ నేతలపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫ్రస్ట్రేషన్ లో ఉన్నారని ఎద్దేవా చేశారు. కూటమి నేతలకు దమ్ముంటే పోలీసు వ్యవస్థను పక్కన పెట్టి సవాలు విసరాలని ఛాలెంజ్ చేశారు.

# భారత్ కు శుభవార్త చెప్పిన ట్రంప్... టారిఫ్ లు తగ్గింపు

- ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్ కాల్
- అనంతరం ట్రూత్ సోషల్ లో పోస్టు
- టారిఫ్ లు 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గింపు



**భారతీయ వెలుగు న్యూఢిల్లీ**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ ల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్ పై ఇంతకుముందు విధించిన ప్రతీకార టారిఫ్ లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ లో పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడిన అనంతరం ఈ ప్రకటన వెలువడడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇంతకీ ట్రంప్ తన ప్రకటనలో ఏమని పేర్కొన్నారంటే...
"ఈ ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) భారత ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. మోదీ నా గొప్ప స్నేహితుల్లో ఒకరు. ఆయన భారత్ లో అత్యంత శక్తిమంతమైన నేత. మేం ఇవాళ ఫోన్ కాల్ లో చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు మోదీ అంగీకరించారు. అమెరికా నుంచి, దాంతో పాటే వెనెజువెలా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. ఈ నిర్ణయం ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలుకుతుందని ఆశిస్తున్నాను. ప్రతి వారం వేలమంది చనిపోతున్న ఆ యుద్ధానికి ఈ నిర్ణయం చరమగీతం పాడుతుందని అనుకుంటున్నాను.
మోదీతో స్నేహం, గౌరవం ఇవన్నీ కాకుండా... ఆయన విజ్ఞప్తి మేరకు అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలిపాం. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న 25 శాతం టారిఫ్ లు 18 శాతానికి తగ్గుతాయి. అదే సమయంలో భారత్ వైపు నుంచి కూడా టారిఫ్ లు తగ్గుతాయనుకుంటున్నాను. దాంతోపాటే, పూర్తి పన్ను రహిత వాణిజ్యానికి ద్వారాలు తెరుచుకుంటాయని ఆశిస్తున్నాను.
అమెరికా తయారీ వస్తువుల కొనుగోలు పట్ల కట్టుబడి ఉంటామని ప్రధాని మోదీ మాటిచ్చారు. ఈ వాణిజ్యం దాదాపు 500 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చు. ఇందులో ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయం, బొగ్గు తదితర ఉత్పత్తులు ఉన్నాయి. భారత్ తో అమెరికా అద్భుతమైన సంబంధాలు మరింత దృఢంగా ముందుకు వెళతాయి. నేను, ప్రధాని మోదీ ఈ ఒప్పందానికి ఓ రూపం కల్పించాం... ఇంతకుమించి ఎక్కువగా చెప్పలేం" అంటూ ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు.

# విడదల రజనిపై కేసు నమోదు

- గత నెల 30న యడ్లపాడు దేవస్థానం వద్ద ఉద్రిక్తత
- రజనితో పాటు 21 మంది వైసీపీ నేతలపై దాడి
- శాంతి భద్రతలకు విఘాతం కలిగించారని కేసు



**భారతీయ వెలుగు ప్రతినిధి విజయవాడ**
ఏపీలో వైసీపీ నేతలపై వరుసగా కేసులు నమోదవుతున్నాయి. తాజాగా మాజీ మంత్రి విడదల రజనిపై కేసు నమోదయింది. యడ్లపాడు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఆమెతో పాటు మరో 21 మంది వైసీపీ నేతలపై కూడా కేసు నమోదయింది.
కేసు వివరాల్లోకి వెళితే... గత నెల 30న యడ్లపాడులోని దేవస్థానానికి తన అనుచరులతో పాటు విడదల రజని వెళ్లారు. తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని చెపుతూ... ఆలయాన్ని శుద్ధి చేయడానికి ఆమె యత్నించారు. అయితే, ఆలయంలోకి వెళ్లకుండా టీడీపీ నేతలు ఆమెను అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో లోపలకు వెళతామని వైసీపీ నేతలు పట్టుబట్టడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు వైసీపీ నేతలకు సర్దిచెప్పి వెనక్కి పంపించారు. ఈ క్రమంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించారంటూ విడదల రజని, ఆమె అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.
తాజాగా అంబటి రాంబాబు, జోగి రమేశ్ లపై కూడా పోలీసు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అంబటిపై... నారా లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు జోగి రమేశ్ పై కేసులు నమోదయ్యాయి. అంబటికి మేజిస్ట్రేట్ రిమాండ్ కూడా విధించారు.

# రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్...



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందని, విస్తరణ పనులు వేగంగా చేసి ఎల్లమ్మబండ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తొలగిస్తామని అన్నారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను త్వరితగతిన స్థాన భ్రంశం చేయాలని, అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సమ్మారెడ్డి, గోపాల్, పోశెట్టిగౌడ్, సుధాకర్, ఎ.ఇ యుగంధర్ రెడ్డి, యు బి డి నాగరాణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సత్తి

**భారతీయ వెలుగు,తూ.గో.జిల్లా ప్రతినిధి(సత్తి వెంకటరెడ్డి అనపర్తి):**



బిక్కవోలు మండలం పందలపాక శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి సమేత శ్రీ రాజరాజేశ్వరి ఆలయ 25 వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తి హరిప్రసాద్ రెడ్డి,పడాల వీర్రాఘవ రెడ్డి, రొంగల వెంకటేశ్వరరావు, గొలుగూరి సత్యనారాయణ రెడ్డి (అబ్బు), పడాల దుర్గారెడ్డి, పాలచర్ల అబ్బు, వంక శ్రీను, పడాల అబ్బులు రెడ్డి, పడాల వెంకటరెడ్డి (మాస్టర్),గొలుగూరి తాతారెడ్డి, తదితరులు ఉన్నారు.

# భారత్-అమెరికా కీలక ట్రేడ్ డీల్..



» ల్యాప్‌టాప్‌లు, గ్యాడ్జెట్ల ధరలు తగ్గే ఛాన్స్!
» భారత్-అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందం
» భారత ఉత్పత్తులపై సుంకాలను 18 శాతానికి తగ్గించిన అమెరికా
» భారత్‌లో చౌకగా మారనున్న ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు
» పప్పు ధాన్యాలు, పాల ఉత్పత్తుల దిగుమతులపై సుంకం తగ్గే అవకాశం
» భారత్ నుంచి వస్త్ర, ఆభరణాల రంగాలకు ప్రయోజనం

**భారతీయ వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ**
భారత్, అమెరికాల మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదిరింది. ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ అనంతరం ఈ డీల్ ఖరారైంది. ఈ ఒప్పందంలో భాగంగా, అమెరికాలోకి దిగుమతి అయ్యే భారతీయ వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దీనికి ప్రతిగా భారత్ కూడా పలు అమెరికా ఉత్పత్తులపై సుంకాలను తగ్గించనుంది. ఈ నిర్ణయంతో దేశంలో అనేక వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది.
ఈ ఒప్పందంతో ముఖ్యంగా టెక్ హార్డ్‌వేర్ ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టనున్నాయి. ల్యాప్‌టాప్‌లు, ఇతర గాడ్జెట్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ వంటివి మరింత పోటీ ధరలకు లభించే అవకాశం ఉంది.
వీటితో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, ప్యాకేజ్డ్ గూడ్స్, గృహోపకరణాల దిగుమతి ఖర్చులు కూడా తగ్గుతాయి. అదే సమయంలో, పప్పు ధాన్యాలు, పాల ఉత్పత్తులు వంటి వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గితే, పెరుగుతున్న ఆహార ద్రవ్యోల్బణం నుంచి కొంత ఉపశమనం లభించవచ్చని నివేదికలు చెబుతున్నాయి.
మరోవైపు, ఈ ఒప్పందం భారత ఎగుమతి రంగాలకు కూడా ఊతమివ్వనుంది. ముఖ్యంగా వస్త్రాలు, రెడీమేడ్ దుస్తుల పరిశ్రమలకు అమెరికా మార్కెట్‌లో ప్రయోజనం చేకూరనుంది. భారత్ నుంచి భారీగా ఎగుమతి అయ్యే రత్నాలు, ఆభరణాల రంగానికి కూడా ఈ డీల్ కలిసి రానుంది. పారిశ్రామిక, ఇంజనీరింగ్ వస్తువులైన స్టీల్, రసాయనాల వంటి వాటికి కూడా మార్కెట్ యాక్సెస్ సులభతరం కానుంది.
అయితే, కొన్ని వస్తువులకు ఈ ఒప్పందంలో మినహాయింపులు ఉన్నాయి. స్టీల్, అల్యూమినియం, రాగి వంటి కొన్ని ఉత్పత్తులపై దాదాపు 50 శాతం వరకు సుంకం కొనసాగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే, కొన్ని ఆటోమొబైల్ విడిభాగాలపై కూడా అధిక సుంకాలు యథాతథంగా ఉండనున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించి, అమెరికా, వెనిజులా నుంచి దిగుమతులను పెంచుకునేందుకు భారత్ అంగీకరించినట్లు కూడా తెలుస్తోంది.
ఈ డీల్‌పై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఈ రోజు నా ప్రియ మిత్రుడు అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడటం ఆనందంగా ఉంది. మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తులపై సుంకాలు 18 శాతానికి తగ్గడం సంతోషకరం. ఈ అద్భుతమైన ప్రకటనకు 140 కోట్ల మంది భారతీయుల తరఫున ట్రంప్‌కు నా ధన్యవాదాలు" అని మోదీ పోస్ట్ చేశారు. ఈ ఒప్పందంపై ఇరు దేశాల నేతలు ప్రకటనలు చేసినప్పటికీ, దీనికి సంబంధించిన పూర్తి నిబంధనలు, షరతులపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## సమస్యల పరిష్కారంలో ముందుంటా: రాకేష్ గైక్వాడ్

» రాజకీయాలకతీతంగా సమన్వయంతో సమస్యల పరిష్కారం



**భారతీయ వెలుగు, హైదరాబాద్ ఫిబ్రవరి 03:**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అక్క నాయకత్వంలో సోనూ భాయ్ (రాకేష్ గైక్వాడ్) హరి బౌలి డివిజన్‌లోని సమస్యల పై అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ
ఒక వృద్ధుడికి పింఛన్ అందడం లేదని, మ్యాన్‌హోల్స్ సమస్య ఉందని, రోడ్లు గుంతలుగా ఉన్నాయని, ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. సమస్యలపై అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కారం చేపడతామని ఈ సందర్భంగా రాకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్ష ఆస్థాన, బి.రాజ్‌కుమార్,ఓంకార్ స్వామి,భాను,నిలయ్ భూషణ్ రాయ్,రష్మీ ఆస్థానా,సురేఖ సక్సేనా,మేఘన,నిఖిల్ అస్థానా,నితేష్ మాథుర్, ముస్కాన్,నితిన్,శ్రీకర్ శర్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రాధాన్యత కల్పిస్తోంది... బండి రమేష్



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈ రంగాల్లో నిధుల కేటాయింపుకు లోటు లేదని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక నాయకులతో కలిసి కూకట్పల్లిలోని జూనియర్ , డిగ్రీ కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ వెంకటయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కాలేజీలో నెలకొన్న సమస్యలను రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. కళాశాలలో మొత్తం 3400 మంది విద్యార్థులు చదువుతున్నారని వీరికి భవనాల కొరత తీవ్రంగా ఉందన్నారు.
ఎప్పుడో 20 ఏళ్ల నాడు నిర్మించిన పాత భవనాలే తప్ప మళ్ళీ కొత్త భవనాలు నిర్మించలేదని దీంతో విద్యార్థులను అకామిడేట్ చేయడం ఇబ్బందికరంగా తయారైంది అన్నారు. వెంటనే స్టూడెంట్స్ అందరికీ సరిపోయిన రీతిలో కొత్త భవనాలను నిర్మించాల్సి ఉందన్నారు. దీనిపై బండి రమేష్ సానుకూలంగా స్పందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి నిధులు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగిరెడ్డి, తాము వేణు, సతీష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గంధం రాజు, కృష్ణరాజు పుత్ ,మైకేల్, వినోద్, రంగమోహన్, ఫణి కుమార్, అరవింద్, గోపాల్ చౌదరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సంత్ శిరోమణి జగద్గురు రవిదాస్ జి మహారాజ్ 649వ జయంతి వేడుకలు...

– మతాలకు అతీతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...





**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
పరంపూజ్య సంత్ శిరోమణి జగద్గురు రవిదాస్ జి మహారాజ్ 649వ జయంతి వేడుకలు మూసాపేట్ జనతా నగర్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. మహారాజ్ సామాగర్ సమాజ్ వారి ఆధ్వర్యంలో మూసాపేట్ జనతా నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన సంత్ రవిదాస్ జయంతి వేడుకల్లో కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి సంత్ రవిదాస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్నందుకు కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని ఘనంగా సన్మానించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ సంత్ రవిదాస్ బోధించిన సమానత్వం, మానవత్వం, కులభేదాలు లేని సమాజ భావనలు నేటి తరానికి మార్గదర్శకమని, ఆయన చూపిన భక్తి మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాల్సినదని అన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, జిల్లా కార్యదర్శి తూము శైలేష్, బిజెపి సీనియర్ నాయకులు కర్కా డాకయ్య, ఐలయ్య, బిజెపి నాయకులు భూముల జీవన్, ప్రశాంత్ రెడ్డి, కృష్ణ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## డిఫెన్సివ్ మోడ్ -- జనసేన నేతల సమస్య ఇదే !

**భారతీయ వెలుగు ప్రతినిధి విశాఖపట్నం**
పవన్ కల్యాణ్ జనరల్ బాడీ మీటింగ్ లో పార్టీ నేతలపై వ్యక్తం చేసిన ఆగ్రహం కేవలం ఒక రాజకీయ నాయకుడి అసహనం మాత్రమే కాదు, అది తన సొంత శ్రేణుల వైఫల్యంపై ఒక నాయకుడి ఆవేదన. జనసేన నాయకత్వంలో బలమైన గొంతుకలు ఉన్నప్పటికీ, ప్రత్యర్థి పార్టీల నుంచి వచ్చే వ్యక్తిగత దాడులను తిప్పికొట్టడంలో వారు ఇంకా డిఫెన్సివ్ మోడ్ లోనే ఉండిపోతున్నారు. ముఖ్యంగా అంబటి రాంబాబు వంటి నేతలు మొదటి నుంచి చిరంజీవి కుటుంబాన్ని టార్గెట్ చేశారు. అలాంటి నేత పైనా అగ్రెసివ్ గా స్పందించకపోవడం పార్టీ నేతల వైఫల్యాన్ని సూచిస్తోందని పవన్ భావిస్తున్నారు.

### ఆత్మరక్షణ కాదు.. ఎదురుదాడి పాలసీ!

కాపు సామాజికవర్గానికి చెందిన కీలక నేతలు ప్రత్యర్థి పార్టీల్లో ఉంటూ, పవన్ ను విమర్శిస్తున్నప్పుడు.. జనసేనలోని అదే వర్గపు నేతలు గట్టిగా మాట్లాడలేకపోవడం ఒక విచిత్రమైన పరిస్థితి. ముఖ్యమంత్రిని బూతులు తిడుతూ, కాపు ముసుగులో రాజకీయం చేసే వారిని నిలదీయడంలో జనసేన నేతలు వెనుకంజ వేస్తున్నారు. ఇది పవన్ కు మనస్తాపాన్ని కలిగిస్తోంది. పార్టీ కోసం, తన కోసం అన్నీ వదులుకుని నిలబడ్డ పవన్ కు, తన వెంట ఉన్న వారు కనీసం గొంతు విప్పకపోవడం ఆయన ఇబ్బందికరంగా భావిస్తున్నారు.

### అనవసర వివాదాలపై స్పందనలు !

ఎంపీలు పెద్దగా మాట్లాడటం లేదు. నాగబాబు వంటి వారు అనవసర విషయాలపై స్పందిస్తూ, కీలకమైన రాజకీయ దాడులు జరిగినప్పుడు మౌనం వహించడం లేదా సోషల్ మీడియాకే పరిమితం కావడం పార్టీ కేడర్ లో అయోమయాన్ని నింపుతోంది. క్షేత్రస్థాయిలో ప్రత్యర్థుల కుట్రలను ఎదుర్కోవడానికి కేవలం పవన్ ఇమేజ్ సరిపోదు, పార్టీ యంత్రాంగం మొత్తం ఒక



సైన్యంలా స్పందించాలన్నది పవన్ అభిప్రాయం. చిరంజీవి కుటుంబంపై , పవన్ వ్యక్తిగత జీవితంపై అంబటి రాంబాబు ఎన్నో కుట్రలు చేశారు. ఆయన చేసిన అలజడికి అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చే మెకానిజం పార్టీలో కొరవడింది. పవన్ కల్యాణ్ ఆశించేది కేవలం తనను సమర్థించడం కాదు, ప్రత్యర్థుల కుట్రలను ప్రజల ముందు ఎండగట్టడం. కానీ, పదవుల్లో ఉన్న నేతలు తమ బాధ్యత కేవలం పరిపాలనకే పరిమితం అనుకోవడం పవన్ ఆగ్రహానికి ప్రధాన కారణం.

### పవన్ ఆగ్రహంతో అయినా మారుతారా?

జనసేన నేతలు పార్టీ స్టాండ్ ను నేతలు అర్థం చేసుకోలేకపోతున్నారు. లడ్డూ కల్తీ వంటి సున్నితమైన అంశాల్లో వైసీపీ రివర్స్ అటాక్ స్ట్రాటజీని అనుసరిస్తున్నప్పుడు, జనసేన నేతలు కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధంగా లేకపోవడం వారి వ్యూహాత్మక లోపాన్ని సూచిస్తుంది. పవన్ కల్యాణ్ నేరుగా రంగంలోకి దిగి మాట్లాడే వరకు మిగిలిన నేతలు మౌనంగా ఉండటం వల్ల, ప్రజల్లోకి వెళ్లాల్సిన అసలు విషయం పక్కదారి పట్టి, కేవలం పవన్ వర్సెస్ వైసీపీగా మారిపోతోంది. ప్రతి అంశానికి పవనే స్పందించాల్సి రావడం ఆయనకు భారంగా మారుతోంది. ఇప్పటికైనా వారు తమ శైలిని మార్చుకుని, పవన్ కు రక్షణ కవచంలా కాకుండా, ప్రత్యర్థులపై విరుచుకుపడే ఆయుధాల్లా మారాలి. పవన్ విజన్ ను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఆయనపై జరిగే విషప్రచారాన్ని గొంతు నొక్కేసే సాహసం నేతలు ప్రదర్శించాల్సి ఉంది.

## తెలంగాణలో జనసేన పోటీ ఎన్ని చోట్ల !?

**భారతీయ వెలుగు బ్యూరో హైదరాబాద్**
తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగకముందే జనసేన పార్టీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంది. పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి ఆధ్వర్యంలో తెలంగామ నుంచి భారీ స్థాయిలో చేరికలను ప్రోత్సహించడం, సమన్వయ కమిటీలను నియమించడం వంటి చర్యలతో కేడర్‌లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. మీడియా గ్రూపులు, సోషల్ మీడియా వేదికగా జరిగిన ప్రచారం చూసి, ఈసారి తెలంగాణ పురపాలక పోరులో జనసేన ఒక నిర్ణయాత్మక శక్తిగా మారుతుంద ప్రకటనుల చేశారు. కానీ, తీరా నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి ఆ హడావుడి కనిపించడం లేదు.

### ఎంత మంది జనసేన తరపున బరిలో నిలిచారు?

ఎన్నికల బరిలో నిలవాలని ఉత్సాహం చూపిన అభ్యర్థులకు పార్టీ తరపున కనీస మార్గదర్శకత్వం కరువైనట్లు కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని స్థానాల్లో జనసేన పోటీ చేస్తోంది..ఎంతమందికి పార్టీ అధికారికంగా 'బీ-ఫారాలు' అందజేసింది? అనే విషయంలో పార్టీ నాయకత్వానికే స్పష్టత లేనట్లుగా కనిపిస్తోంది. పార్ తరపున బరిలోకి దిగాలనుకున్న అభ్యర్థులు, చివరి నిమిషంలో ఎవరిని సంప్రదించాలో తెలియక, బి-ఫారాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం ఇబ్బందికరంగా మారిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### ఉత్సాహం చూపిన వారికి బీ ఫారాలు అందించలేకపోయారా?

హైప్రొఫైల్ నేతలు మీడియా ముందు కనిపించినంత వేగంగా, క్షేత్రస్థాయిలో అభ్యర్థులను సమన్వయం చేయడంలో విఫలమయ్యారు. తెలంగాణలో జనసేనకు బలమైన యువ ఓటు బ్యాంకు ఉందని పవన్ నమ్మకం. దానిని ఓట్లుగా మార్చుకునే వ్యూహరచనలో పార్టీ ఎప్పుడూ వెనుకబడే ఉంటోంది. మున్సిపల్ ఎన్నికల వంటి స్థానిక పోరాటాల్లో పార్టీ గుర్తింపు అనేది అత్యంత కీలకం. కానీ, సమయానికి బీ-ఫారాలు ఇవ్వలేకపోవడం వల్ల చాలామంది అభ్యర్థులు స్వతంత్రులుగా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇది పార్టీ ఉనికిని చాటుకోవాలనుకున్న తరుణంలో తీవ్ర ఇబ్బందికరమైన అంశం.

### పార్టీ బలోపేతం కోసం సమగ్ర కార్యాచరణ అవసరం

తెలంగాణపై పవన్ కల్యాణ్ ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఆయన పార్టీని బలోపేతం చేయాలనుకుంటున్నారు. అయితే ఏపీలో అధికార విధుల్లో ఆయన చాలా బిజీగా ఉంటున్నారు. రామ్ తాళ్లూరి ఇక్కడ నాయకత్వాన్ని తీసుకుని మరింతగా అభివృద్ధి చేయాలనుకుంటున్నారు కానీ ఆయన కూడా తొలి అడుగుల్లో విజయవంతం కాలేకపోతున్నారు. ఈ అంశంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోందని జనసేన తెలంగాణ నేతలు భావిస్తున్నారు.

## బాబును తిడితే మైలేజీ పెరుగుతుందా..!?

**భారతీయ వెలుగు విజయవాడ బ్యూరో**
సీఎం చంద్రబాబును తిట్టడం ద్వారా గ్రాఫ్ పెరుగుతుందా అనేది ఇప్పుడు టిడిపిలోనూ అటు వైసిపిలోనూ చర్చ నడుస్తోంది. వ్యక్తిగత లాభం కోసం చంద్రబాబును దూషించిన చాలామంది నాయకులు ఫేడ్ అవుట్ అయ్యారు. ఇలాంటి వారిలో గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు నాని, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ప్రస్తుతం జైలు పాలైన అంబటి రాంబాబు కూడా గత ఎన్నికల్లో ఘోరంగా ఓటమిపాలయ్యారు.
ఈ ముగ్గురు గతంలో వైసిపి అధినేతగా ఉన్న చంద్రబాబును లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేసిన వారే. అదేవిధంగా మంత్రి నారా లోకేష్ ను తీవ్రస్థాయిలో దూషించిన వారే. నారా లోకేష్ ను విమర్శించిన వారి జాబితాలో చాలామంది ఉన్నారు. కానీ చంద్రబాబును ప్రత్యేకంగా టార్గెట్ చేసి తీవ్ర విమర్శలు చేసిన వారిలో కొడాలి నాని, వల్లభనేని వంశీ ముందువరుసలో నిలిచారు. అసెంబ్లీ వేదికగానే వారు చంద్రబాబును దూషించారు. చంద్రబాబు సతీమణి, ఆయన కుటుంబంపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు.



ఖర్జూర నాయుడు కిస్మిస్ నాయుడు అంటూ చంద్రబాబు తండ్రిపై ఆనాడు కొడాలి నాని చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ యూట్యూబ్లో వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా అంబటి రాంబాబు చేసిన దుర్భాషలు కూడా తీవ్ర విమర్శలకు దారి తీశాయి. నిజానికి చంద్రబాబును తిట్టినందువల్ల ఎవరి గ్రాఫ్ పెరగలేదన్న విషయం గత ఎన్నికల్లోనే స్పష్టమైంది. చంద్రబాబును లక్ష్యంగా చేసుకున్న పలువురు నేతలు ఓటమిపాలయ్యారు. వైసీపీకి గాలి లేకపోవడం ఒక కారణమైతే, చంద్రబాబుపై వ్యక్తిగత దాడులు ప్రజల్లో ప్రతికూల భావన కలిగించాయన్న అభిప్రాయం వినిపించింది.
అందుకే ఐదు సార్లు విజయం సాధించిన కొడాలి నాని సైతం గత ఎన్నికల్లో పరాజయం చవిచూశారు. ఇక ఇప్పుడు కూడా అదే విధానాన్ని కొనసాగిస్తే వైసిపి నాయకులకు ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయన్నది ఆసక్తిగా మారింది. ఎన్నికల్లో మళ్లీ గెలవాలంటే చంద్రబాబును టార్గెట్ చేయడం కంటే ప్రజల మధ్యకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తేనే నాయకులకు ప్రాధాన్యం పెరుగుతుందని పరిశీలకులు చెబుతున్నారు.
ఈ దిశగా కొంతమంది వైసిపి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. అయితే ఇప్పటికీ కొందరు నాయకులు చంద్రబాబును విమర్శించడం ద్వారా టిడిపిని రెచ్చగొట్టి లాభం పొందాలనే ప్రయత్నం చేయడం ఆ పార్టీకి మేలు చేయదని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇటువంటి పరిణామాలను ప్రజలు సహించరని అంటున్నారు. భవిష్యత్తులో అయినా విజయం సాధించాలంటే, ప్రజల మద్దతు పొందాలంటే చంద్రబాబు లేదా లోకేష్ ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం మానేసి అభివృద్ధి, గతంలో జరిగిన పొరపాట్ల సవరణ దిశగా అడుగులు వేయడం మంచిదని సూచిస్తున్నారు.

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షాల ఫైర్

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై తీవ్ర విమర్శలు
- భారత సార్వభౌమాధికారంపై ప్రశ్నలు లేవనెత్తిన విపక్షాలు
- ట్రంప్ ప్రకటనల వెనుక దాగివున్న అజెండా ఉందని ఆరోపణ
- రైతులు, ఇంధన భద్రతపై ప్రభావం చూపుతుందని ఆందోళన



**భారతీయ వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ**
భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశ సార్వభౌమాధికారం, ప్రభుత్వ పారదర్శకత, రైతుల ప్రయోజనాలు, ఇంధన భద్రత వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం బదులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటనలు చేయడంపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ఒప్పందం వల్ల అమెరికాకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వారు ఆరోపించారు.

ఈ ఒప్పందంపై సంతోషించాల్సింది ఏమీ లేదని కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ అన్నారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "గతంలో 3-4 శాతంగా ఉన్న టారిఫ్‌ను ఇప్పుడు 18 శాతానికి తగ్గించామని సంబరపడటం ఆశ్చర్యంగా ఉంది. మన దేశానికి సంబంధించిన వాణిజ్య ఒప్పందాల గురించి ట్రంప్ చెప్పడమేంటి? మనం ఇంకా సార్వభౌమ దేశం కాదా? ఏ దేశం నుంచి చమురు కొనాలి, ఎవరితో వ్యాపారం చేయాలో అమెరికా నిర్ణయిస్తుందా? ప్రధాని బదులు ట్రంప్ నుంచి ఇలాంటి కీలక సమాచారం రావడం దేశానికి మంచి సంకేతం కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు.

అమెరికా తన ప్రయోజనాలు లేకుండా ఏ ఒప్పందమూ చేసుకోదని, దీని వెనుక కచ్చితంగా రహస్య ఎజెండా ఉందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపి రామ్ గోపాల్ యాదవ్ ఆరోపించారు. "అమెరికా చాలా తెలివైన వ్యాపారి. ఆయుధాల కొనుగోలు లేదా కొన్ని మార్గాల నుంచి చమురు కొనవద్దనే ఒత్తిడి వంటివి దీని వెనుక ఉండొచ్చు. వారు బహిరంగంగా ఒప్పుకోరు కానీ, కచ్చితంగా ఏదో దాగి ఉంది" అని ఆయన అన్నారు.

మరో కాంగ్రెస్ ఎంపీ జేబీ మాథర్ మాట్లాడుతూ, "వాణిజ్య ఒప్పందం అయినా, మరో ప్రకటనైనా అన్నీ ట్రంపే చేస్తున్నారు. భారత్ అమెరికాకు లొంగిపోయిందా? ఈ ఒప్పందం చుట్టూ ఎన్నో అనుమానాలు అలుముకున్నాయి. వ్యవసాయ ఒప్పందాలు, రైతుల హక్కుల సంగతేంటి? రష్యా నుంచి కాకుండా వెనిజులా, అమెరికా నుంచి చమురు కొనాలనే ఒత్తిడి నిజమేనా? వీటన్నింటిపై స్పష్టత రావాలి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ప్రభుత్వం సభలో దీనిపై చర్చకు సిద్ధపడాలి" అని డిమాండ్ చేశారు.

రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల సంబంధాలను దెబ్బతీసేలా అమెరికా ఒత్తిడి చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ ఉజ్వల్ రామన్ సింగ్ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న రష్యా చమురును కాదని, ఎక్కువ ధరకు వెనిజులా నుంచి కొనాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత సోమవారం ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వస్తువులపై అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించగా, అమెరికా ఉత్పత్తులపై భారత్ కొన్ని వాణిజ్య అడ్డంకులను సడలించింది. ఈ ఒప్పందంతో భారత ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం చెబుతుండగా, దీనిపై పార్లమెంటులో పూర్తి వివరాలతో కూడిన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి.

## వాట్సాప్ సమస్త కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్

- వ్యక్తిగత గోప్యత విషయంలో ఆటలొద్దు.. రాజ్యాంగాన్ని ఫాలో కావాల్సిందే
- రూల్స్ అమలు చేయకుంటే దేశంలో నుంచి వెళ్లిపోండి
- మెటాకు హెచ్చరికలు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం



**భారతీయ వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ**
భారత పౌరుల వ్యక్తిగత గోప్యత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోమని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. దేశంలో వ్యాపారం చేయాలంటే భారత రాజ్యాంగాన్ని గౌరవించాల్సిందేనని, రాజ్యాంగ విలువలను, నిబంధనలను పాటించి తీరాలని స్పష్టం చేసింది. రాజ్యాంగ నిబంధనలను పాటించకుంటే దేశం విడిచి వెళ్లాల్సిందేనని వాట్సాప్ మాతృసంస్థ మెటాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఈ రోజు జరిగిన విచారణలో వాట్సాప్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనల విషయంలో వాట్సాప్ తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఫైర్ అయింది. వాట్సాప్ యూజర్ల వివరాలను, డేటాను మెటాతో పంచుకునేందుకు వీల్లేదని స్పష్టం చేసింది.

డేటా షేరింగ్, మార్కెట్ ఆధిపత్యానికి సంబంధించి గత నెలలో ఎన్సీఎల్టీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వాట్సాప్, మెటా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సహా పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై సుప్రీం విచారణ జరిపింది. ఈ సందర్భంగా వాట్సాప్ పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సీరియస్ వ్యాఖ్యలు చేశారు. 'మీరు మా దేశ పౌరుల గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలో ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేము అనుమతించబోము' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అమెరికా సంస్థ మెటాకు తేల్చిచెప్పారు.

భారత చట్టాలను పాటించలేకపోతే దేశం వదిలి వెళ్లాలని సూచించారు. డేటా షేరింగ్ ఉండదని హామీ ఇవ్వాలని, లేదంటే ఈ కేసును కొట్టేస్తామని హెచ్చరించారు. చాట్ ట్రెండ్‌ల ఆధారంగా ప్రకటనలతో సహా వినియోగదారు డేటా ప్రవర్తన, వాణిజ్య దోపిడీ వినియోగదారుల హక్కులను ఉల్లంఘిస్తుందని కోర్టు తెలిపింది. వైద్యులతో ప్రైవేట్ చాట్‌ల తర్వాత వినియోగదారులు ఔషధాల కోసం ప్రకటనలను అందుకున్న సందర్భాలను కూడా గుర్తుచేసింది. ఇది డేటా మానిటైజేషన్ పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

## ఇండియా గేట్ ఫొటో షేర్ చేసిన ట్రంప్...

- ట్రూత్ సోషల్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు
- ఇండియా గేట్ అందంగా ఉంటుందంటూ ట్రంప్ కామెంట్
- మాది ఇంకా గొప్పగా ఉంటుంది' అంటూ తనదైన శైలిలో వ్యాఖ్య
- అమెరికాలో భారీ 'ఇండిపెండెన్స్ ఆర్చ్' నిర్మించాలనే ప్రతిపాదన
- 250 అడుగుల ఎత్తుతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్చ్‌గా ప్లాన్
- ప్రాజెక్టుకు ఇంకా అనుమతులు లభించలేదని నివేదికల వెల్లడి



**భారతీయ వెలుగు బ్యూరో న్యూఢిల్లీ**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, న్యూఢిల్లీలోని ప్రఖ్యాత ఇండియా గేట్ చిత్రాన్ని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ట్రూత్ సోషల్‌'లో పోస్ట్ చేశారు. భారత చారిత్రక కట్టడాన్ని ప్రశంసిస్తూనే, "భారతదేశం యొక్క అందమైన విజయ స్తంభం, మాది అందరికంటే గొప్పదిగా ఉంటుంది" అని తనదైన శైలిలో ఓ వ్యాఖ్యను జోడించారు. సోమవారం చేసిన ఈ పోస్ట్ వెనుక ఓ పెద్ద ప్రణాళిక ఉన్నట్లు స్పష్టమవుతోంది.

అమెరికా స్వాతంత్ర్యం సిద్ధించి 250 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వాషింగ్టన్ డీసీలో ఓ భారీ విజయ ద్వారం (Triumphal Arch) నిర్మించాలనేది ట్రంప్ ప్రతిపాదన. 'ఇండిపెండెన్స్ ఆర్చ్'గా పిలుస్తున్న ఈ నిర్మాణంతో తన ప్రణాళికను మరోసారి ఆయన తెరపైకి తెచ్చారు. "250 ఏళ్ల స్వాతంత్ర్యానికి గుర్తుగా 250 అడుగుల ఎత్తు" అనే నినాదంతో దీన్ని నిర్మించాలని ఆయన భావిస్తున్నారు. ఈ ఆర్చ్ పూర్తయితే, అమెరికా రాజధానిలోని వైట్ హౌస్ (70 అడుగులు), లింకన్ మెమోరియల్ (100 అడుగులు) కంటే ఎంతో ఎత్తుగా ఉంటుంది.

ప్రపంచంలోని ప్రఖ్యాత కట్టడాలతో పోలుస్తూ, పారిస్‌లోని ఆర్క్ డి ట్రయంఫ్ (164 అడుగులు), మెక్సికో సిటీలోని ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్చ్ (220 అడుగులు) కన్నా కూడా తన ఆర్చ్ పెద్దదిగా ఉండాలని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, ఇండియా గేట్ ఎత్తు 138 అడుగులు. మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుల స్మారకార్థం దీన్ని నిర్మించారు.

అయితే, ట్రంప్ ప్రతిపాదిస్తున్న ఈ భారీ ప్రాజెక్టుకు ఇంకా అధికారిక డిజైన్లు ఖరారు కాలేదని, నిర్మాణ అనుమతులు కూడా లభించలేదని తెలుస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణం కార్యరూపం దాల్చడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.

## జనసేన సమావేశం నుంచి కోపంగా వెళ్లిపోయిన పవన్ కల్యాణ్




**భారతీయ వెలుగు బ్యూరో మంగళగిరి**
పవన్ కల్యాణ్ పార్టీ నేతలపై సీరియస్ అయ్యారు. సమావేశం నుంచి ఆగ్రహంతో మధ్యలోనే వెళ్లిపోయారు. మంగళగిరిలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో పార్టీ నేతల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో నిర్వహించిన ఈ సర్వసభ్య సమావేశంలో అధినేత పవన్ కల్యాణ్ పార్టీ నేతల తీరుపై నిప్పులు చెరిగారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని, ఆ పార్టీ నేతల విమర్శలను తిప్పికొట్టడంలో జనసేన నేతలు విఫలమవుతున్నారని ఆయన మండిపడ్డారు. లడ్డూ విషయంలో ఇంతటి అపచారం జరిగినా, దానిపై ప్రత్యర్థి పార్టీలు ఎదురుదాడి చేస్తున్నా మన నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన నిలదీశారు.

ప్రతి అంశంపై నేనే మాట్లాడాలా? నేనే స్పందించాలా? ఇక మీరెందుకు? అంటూ పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేష్ వంటి వారు కూటమి ప్రభుత్వంపై, తనపై పరుష పదజాలంతో విమర్శలు చేస్తున్నా, కనీసం వాటిని ఖండించకపోవడంపై ఆయన సీరియస్ అయ్యారు. పార్టీలో క్రమశిక్షణ లోపిస్తోందని, పదవులు వచ్చిన తర్వాత నేతల్లో నిర్లిప్తత పెరిగిందని ఆయన అసహనం వ్యక్తం చేశారు. అబద్ధాలను ప్రచారం చేస్తున్న వారిని అదే స్థాయిలో ఎదుర్కోవాల్సిన బాధ్యత నేతలపై ఉందని స్పష్టం చేశారు. అరవ శ్రీధర్ అంశంపైనా మండిపడ్డారు. కష్టపడి పార్టీని నిర్మించుకున్నామని నాశనం చేస్తామంటే ఊరుకునేది లేదని నష్టం చేశారు.

సమావేశం జరుగుతుండగానే పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెళ్లే ముందు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో మాట్లాడుతూ.. పార్టీలోని ప్రతి నేత పనితీరుపై, వారు చేపట్టిన కార్యక్రమాలపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఏం చేస్తున్నారు..సామాజిక మాధ్యమాల్లో .. క్షేత్రస్థాయిలో ప్రత్యర్థుల విమర్శలకు ఏ విధంగా కౌంటర్ ఇస్తున్నారు అనే అంశాలపై ఆరా తీయాలని చెప్పారు.

## హెచ్-1బి వీసా రిజిస్ట్రేషన్ షెడ్యూల్ విడుదల

- మార్చి 4 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం
- ఫీజు భారీగా పెంపు.. ఏకంగా లక్ష డాలర్లు!
- లాటరీలో కొత్త 'వెయిటేజ్' విధానం
- ఎంపికైన వారికి మార్చి 31న నోటీసులు




**భారతీయ వెలుగు ప్రతినిధి న్యూఢిల్లీ**
అమెరికాలో ఉద్యోగం చేయాలనుకునే విదేశీ నిపుణుల కోసం ఇచ్చే హెచ్-1బి వీసాల ప్రక్రియలో అగ్రరాజ్యం భారీ మార్పులు చేపట్టింది. 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వీసా రిజిస్ట్రేషన్ గడువును యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ప్రకటించింది. అయితే, ఈసారి నిబంధనలు గతంలో కంటే అత్యంత కఠినంగా మారాయి.కీలక తేదీలు ఇవే రిజిస్ట్రేషన్ ప్రారంభం: మార్చి 4, 2026 (మధ్యాహ్నం 12 గంటల నుంచి)చివరి తేదీ: మార్చి 19, 2026
ఫలితాల ప్రకటన: మార్చి 31, 2026

### లక్ష డాలర్ల అదనపు భారం

ట్రంప్ ప్రభుత్వం 2025 సెప్టెంబర్‌లో తీసుకొచ్చిన కొత్త నిబంధనల ప్రకారం.. కొన్ని రకాల హై-స్కిల్డ్ పొజిషన్లకు ఎంపికైన వారు ఏకంగా 1,00,000 డాలర్ల (సుమారు రూ. 83 లక్షలు) అదనపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ముఖ్యంగా అమెరికా వెలుపల ఉండి వీసా కోసం దరఖాస్తు చేసే వారికి ఈ భారం తప్పదు. ఇది కంపెనీలకు పెను ఆర్థిక భారంగా మారనుంది. అలాగే ప్రాథమిక రిజిస్ట్రేషన్ ఫీజును కూడా 10 డాలర్ల నుంచి 215 డాలర్లకు పెంచారు.

### కొత్త 'వెయిటేజ్' విధానం

ఇప్పటివరకు ఉన్న రాండమ్ లాటరీ విధానానికి బదులు ఈసారి 'వెయిటేజ్' విధానాన్ని ప్రవేశపెట్టారు. అంటే ఎవరికైతే ఎక్కువ జీతం ఆఫర్ చేస్తారో, వారికి వీసా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. నైపుణ్యం గల వారికి ప్రాధాన్యం ఇవ్వడమే లక్ష్యంగా ఈ మార్పు చేసినట్లు అధికారులు చెప్తున్నారు.

### దరఖాస్తు విధానం

నియామక సంస్థలు ముందుగా ఖుజ×ూ వెబ్‌సైట్‌లో అకౌంట్ తెరిచి తమ ఉద్యోగుల వివరాలను నమోదు చేయాలి. కేవలం లాటరీలో ఎంపికైన వారు మాత్రమే ఏప్రిల్ 1 నుంచి పూర్తిస్థాయిలో వీసా పిటిషన్లను దాఖలు చేయడానికి అర్హులు.

ఈ భారీ ఫీజు పెంపు (1,00,000 డాలర్లు)పై అమెరికాలోని పలు ఐటీ కంపెనీలు, వాణిజ్య మండలి కోర్టును ఆశ్రయించాయి. అయితే కోర్టు ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఈ ఏడాది దరఖాస్తు చేసే వారు ఈ ఖర్చుకు సిద్ధపడాల్సిందే. ముఖ్యంగా చిన్న తరహా కంపెనీలు, స్టార్టప్‌లు ఈ నిబంధన వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.

## మంత్రి పొన్నం బావమరిదికి 'హ్యాండ్' ఇచ్చిన కాంగ్రెస్!

- పెద్ది నవీన్ కుమార్ గౌడ్‌కు దక్కని టికెట్
- అడ్డుపడ్డ 'స్థానికేతర' నినాదం
- పొన్నం, మహేశ్ గౌడ్ ప్రయత్నాలు విఫలం
- రెబల్‌గా బరిలోకి దిగే ఛాన్స్!




**భారతీయ వెలుగు ప్రతినిధి జనగాం**
జనగామ మున్సిపల్ ఎన్నికల బరిలో నిలవాలనుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ బావమరిది పెద్ది నవీన్ కుమార్ గౌడ్‌కు చుక్కెదురైంది. 6వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, మున్సిపల్ ఛైర్మన్ పీఠం దక్కించుకోవాలని ఆయన వేసిన ప్లాన్ తలకిందులైంది. సోమవారం విడుదలైన అభ్యర్థుల తుది జాబితాలో నవీన్ పేరు లేకపోవడంతో ఆయన అనుచరులు షాక్‌కు గురయ్యారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ భార్యకు తమ్ముడైన నవీన్ కోసం స్వయంగా మంత్రి, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గట్టిగానే ప్రయత్నించినట్లు సమాచారం. అయితే, నవీన్ 'స్థానికేతరుడు' (హనుమకొండకు చెందిన వ్యక్తి) అంటూ స్థానిక కాంగ్రెస్ నేతలు భీష్మించుకు కూర్చున్నారు. నవీన్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ సంతకాల సేకరణ చేపట్టి మరీ అధిష్ఠానానికి పంపారు.

స్థానికుల ఒత్తిడికి తలొగ్గిన ఎంపిక కమిటీ చివరకు బుక్క బాల భరద్వాజ్‌ను 6వ వార్డు అభ్యర్థిగా ఖరారు చేసింది. గతంలో రెండుసార్లు పార్టీ కోసం త్యాగం చేసి నామినేషన్లు ఉపసంహరించుకున్న బాల భరద్వాజ్‌కే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కమిటీ భావించింది.

టికెట్ నిరాకరణతో నవీన్ కుమార్ గౌడ్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఆయన తండ్రి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ నేత వెంకటనారాయణ గౌడ్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. పార్టీ టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగానైనా లేదా మరో పార్టీ తరఫునైనా నవీన్‌ను బరిలోకి దించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జనగామ 6వ వార్డులో కాంగ్రెస్ అధికారిక అభ్యర్థికి గట్టి పోటీ తప్పదు.

జనగామ మున్సిపాలిటీలో మొత్తం 30 వార్డులకు గానూ కాంగ్రెస్ 26 స్థానాల్లో పోటీ చేస్తోంది. పొత్తులో భాగంగా సీపీఎంకు 3, సీపీఐకి 1 వార్డు కేటాయించారు. టికెట్లు రాని మరికొంతమంది అసమ్మతి నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. నవీన్ కుమార్ గౌడ్ ఒకవేళ ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే, మంత్రి కుటుంబంలోనే రాజకీయ విభేదాలు బయటపడే అవకాశం ఉంది.

## మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 52 శాతం బీఫాంలు ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్



**భారతీయ వెలుగు, హైదరాబాద్, ఫిబ్రవరి 03:**
మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 52 శాతం బీఫాంలు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...

గత సర్పంచ్ ఎన్నికల్లో బీసీలు జనరల్ స్థానాల్లోనే 52 శాతం విజయం సాధించారని గుర్తు చేశారు. ఇది బీసీల రాజకీయ సామర్థ్యానికి, ప్రజాదరణకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అయినా ఎన్నికలు వస్తే బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం అన్యాయమని ఆయన విమర్శించారు.

దేశ జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో అన్ని పార్టీలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. మాటలకే పరిమితమయ్యే బీసీ హామీలు ఇకనైనా ఆచరణలోకి రావాలని అన్నారు. బీసీలకు బీఫాంలు కేటాయించకపోతే పార్టీలకు అతీతంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీల రాజకీయ హక్కులు కాపాడాలంటే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నుంచే న్యాయమైన ప్రాతినిధ్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని గవ్వల భరత్ కుమార్ స్పష్టం చేశారు. బీసీలకు 52 శాతం బీఫాంలు కేటాయించినప్పుడే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచిగారి ప్రవీణ్, బీసీ సంఘం గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షులు అభిలాష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ బిసి యువజన సంఘం అధ్యక్షులు విశాల్ పటేల్, బీసీ సంఘం మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షులు సుమన్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాశ్యప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బి-ఫామ్ స్వీకరించిన 41 డివిజన్ అభ్యర్థి



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 03:**
రామగుండం నగరపాలక కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా గోదావరిఖని పట్టణంలోని 41వ డివిజన్ అభ్యర్థి చుక్క సాయిప్రదీప్ భాజపా పార్టీ బీ-ఫామ్ లభించడంతో సంతోషం వ్యక్తపరిచారు. కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల నామినేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో 41 డివిజన్ నుంచి పోటీ బరిలో నామినేషన్ దాఖలు చేశారు. భాజపా పార్టీ నేతలు అభ్యర్థికి బి-ఫామ్ ఇవ్వడంతో బలం చేకూరింది. దీంతో పూర్తిస్థాయిలో భాజపా పార్టీ తరపున ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. ఈ సందర్భంగా భాజపా సీనియర్ నాయకులు చంద్రమౌళి, హనుమంతుగౌడ్, శివాజీలు 41వ డివిజన్ అభ్యర్థి సాయి ప్రదీప్ కు బి-ఫామ్ ధ్రువపత్రం అందజేసి అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని కోరారు.

## 39వ డివిజన్ కాంగ్రెస్ బి ఫామ్ సమర్పించిన తిప్పారపు మానస శరత్





**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 03:**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్ నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తిప్పారపు మానస శరత్ తన బి ఫామ్ ను సమర్పించారు. మంగళవారం రిటర్నింగ్ ఆఫీసర్ కు తన బి ఫామ్ ను అందజేశారు. మాటలకే పరిమితం కాకుండా చూపించే సేవే తన రాజకీయ పునాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తూ వ్యక్తిగతంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో తనకంటూ గుర్తింపును తెచ్చుకున్నారని తెలిపారు. డివిజన్లో తాగునీటి సమస్యలు, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అలాగే మహిళలు, యువతకు అవకాశాలు కల్పించడం, పేదల సమస్యలపై తక్షణ స్పందన తన ప్రధాన ప్రాధాన్యాలని ఆయన స్పష్టం చేశారు. డివిజన్లో ఏ సమస్య తలెత్తినా ప్రజల దగ్గరకే వెళ్లి సమస్యను విని, పరిష్కారం చూపే విధంగా పనిచేస్తానని అన్నారు. ప్రజల నమ్మకమే తన బలమని, ప్రజల ఆశీస్సులు, సహకారంతో విజయం సాధించి డివిజన్ అభివృద్ధికి నిజాయితీగా పని చేస్తానని హామీ ఇచ్చారు.

## ఏఎస్పికి ఆహ్వానం



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 14 నుండి 16 వరకు జరిగే మహా శివరాత్రి జాతరకు రావాల్సిందిగా ఏఎస్పి రుత్విక్ సాయిని మంగళవారం రాజన్న ఆలయ ఈవో ఎల్. రమాదేవి సబ్ డివిజన్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో ఏఎస్పీకి ఆశీర్వచనం గావించి స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## గౌడ కులస్తుల కుల దైవం శ్రీ రేణుకా మాత ఆలయంలో అన్నదాన కార్యక్రమం సందర్భంగా వెల్దుర్తి ఇన్చార్జి తాసిల్దార్ శ్రీనివాసును

**- గ్రామ సర్పంచ్ ఆదర్శ్ ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ వార్డు సభ్యులు శాకారం శ్రీనివాస్ గౌడ్ ను సన్మానించిన గౌడ సంఘకులస్తులు**





**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఫిబ్రవరి 3**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో, గల శ్రీ రేణుక మాత ఆలయంలో గౌడ సంఘం సభ్యులు మంగళవారం రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం అమ్మవారికి గతంలో పోసినటువంటిఓడి బియ్యం తో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల రెవెన్యూ ఇంచార్జ్ అధికారి శ్రీనివాస్, నూతనంగాఎన్నుకున్నటువంటి వెల్దుర్తి గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు సాకారం శ్రీనివాస్ గౌడ్ లను శ్రీ రేణుకా మాతఆలయ కమిటీ సభ్యులుశాలువాలతోసన్మానించి అమ్మవారి కిప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జగ్గముత్తా గౌడ్, కోదండ కృష్ణ గౌడ్, జగ్గ అశోక్ గౌడ్, శాఖరం వెంకటేష్ గౌడ్, నాలాచెరువువెంకటయ్యగౌడ్,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ అభినందనలు గౌడ కులస్తులకు ఆధార దైవము అయినటువంటి శ్రీ రేణుకా మాత ఆలయంలో మంగళవారం నాడు అన్నదాన కార్యక్రమానికి నూతనంగా గ్రామపంచాయతీ పాలకవర్గం లోని సర్పంచ్ కి ఉపసర్పంచ్ వాడు వాడు సభ్యుడికి గౌడ సంఘం తరపున వారిని సన్మానించడం జరిగిందని గౌడ కులస్తులు తెలియజేశారు రానున్న రోజుల్లో గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యుల సహకారంతో శ్రీ రేణుకా మాత దేవాలయాన్ని అభివృద్ధి చేసే విధంగానే మా గౌడ కులస్తులకు సహకరించాలని పత్రిక ముఖంగా కోరుతున్నామని వారు తెలియజేశారు

## చత్రపతి శివాజీ విగ్రహానికి శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించిన

**- గ్రామ సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి**



**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఫిబ్రవరి 3**
మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పొలంపల్లి గ్రామంలో చత్రపతి శివాజీ విగ్రహం భూమి పూజ శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి ఛత్రపతి శివాజీ కి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు అనంతరం మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు కు మా గ్రామంలో చత్రపతి శివాజీ నిర్మించాలని అడగగా ఆయన వెంటనే స్పందించి విగ్రహాన్ని నేను ఇస్తానని స్పందించిన ఎంపీ రఘునందన్ రావుకు శ్రీరామ్ యూత్ సంఘ సభ్యులు గ్రామ సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామీలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు
గ్రామ ప్రజలు పెద్దలు యువజన సంఘాల నాయకులు గ్రామంలో ఉన్న అన్ని వర్గాల యూత్ నాయకులు,యూత్ అధ్యక్షులు మన్నె శ్రీకాంత్, యాట భాను,వార్డు సభ్యులు ప్రవీణ్, యాట చంద్రం,పులిమామిడి చంద్రం, పులిమామిడి రాజు,ఎర్రోళ్ల శ్రీను,బుల్లి మల్లేష్,కుమ్మరి యాదగిరి బిజెపి సీనియర్ నాయకులు జరిగే గణేష్ తప్ప భాస్కర్, తప్ప మధు, గొల్ల అశోక్, కిషన్, మహేష్, కుమార్, ప్రతికుమార్, ప్రశాంత్, భూపాల్, ఐలయ్య, పెంటి, దాసు, గ్రామ పెద్దలు యువ నాయకులు యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విజయమే లక్ష్యంగా పనిచేద్దాం..కాంగ్రెస్ అబద్ధపు హామీలను ప్రజలకు వివరించాలి

**-బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు బిఫామ్ లు**
**-అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**



**భారతీయ వెలుగు , సంగారెడ్డి ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా అందోలు-జోగిపేట మున్సిపాలిటీపై గులాబీ జెండా రెపరెపలాడే దిశగా అందరూ కష్టపడాలని, విజయమే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లాలని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మంగళవారం జోగినాథ స్వామి దేవాలయం వద్ద ఎన్నికల బరిలో నిల్చిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు బిఫామ్స్ లు అందచేశారు. 20 వార్డుల్లో బిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు జోగినాథ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం బిఫారాలను అందజేసి పట్టణ అభివృద్ధికి కంకనబద్ధులమై ఉంటామని, నీతి నిజాయితీగా పనిచేస్తూ పట్టణ ప్రజల సమస్యలు తీర్చడంలో ముందుంటామని అభ్యర్థులతో ప్రమాణం చేయించి అందరినీ క్రాంతి కిరణ్, ఎన్నికల పరిశీలకులు నరహరి రెడ్డి ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసిఆర్ మార్గదర్శకత్వంలో అందోలు-జోగిపేట అభివృద్ధికి పాటుపడతామని ప్రమాణం చేశారు.
పోటిలో నిలిచిన అభ్యర్థులు మీరే:
1వ వార్డు మన్నే చక్రపాణి
2వ వార్డు జిన్నా విజయ్ కుమార్
3వ వార్డు పస్తం ప్రవీణ్
4వ వార్డు మల్కల మాదవి
5వ వార్డు తాలుక విజయ లక్ష్మి
6వ వార్డు రొయ్యల నాగ రాణి
7వ వార్డు మహ్మద్ షకీల్ ఖురేషి
8వ వార్డు రాచకొండ నాగ రత్నం గౌడ్
9వ వార్డు హన్మంత్ రావు పేట శోభ నారాయణ గౌడ్
10వ వార్డు చౌరీ గారి విజయ లక్ష్మి
11వ వార్డు బీర్ల లత శంకర్
12వ వార్డు అల్లే విద్య
13వ వార్డు పట్లూరి శివ శేఖర్
14వ వార్డు పల్లె నాగ జ్యోతి
15వ వార్డు మహ్మద్ ఇమ్రాన్ ఖాన్
16వ వార్డు గాజుల రవి కుమార్
17వ వార్డు కడవత్ గణేష్
18వ వార్డు కట్టెల నాగ జ్యోతి 19వ వార్డు గడిండ్ల భారతి విఠల్ గౌడ్
20వ వార్డు డాకురి బుగుడాల నాగ

## రణవీర్--శ్రేయాస్ టెక్వాండో అకాడమీ విద్యార్థినులకు తొలి బెల్ట్‌లు





**భారతీయ వెలుగు దిన పత్రిక మల్కాజిగిరి మండల ప్రతినిధి**
కౌకూర్ ప్రాంతంలోని రణవీర్ మరియు శ్రేయాస్ టెక్వాండో అకాడమీలో మాస్టర్ రమేష్ గారి మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు నిఖిత, సహానా, మాధురి టెక్వాండోలో తమ మొదటి బెల్ట్‌ను విజయవంతంగా సాధించారు. ఇది వారి క్రీడా జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.ఈ సందర్భంగా మాస్టర్ రమేష్ మాట్లాడుతూ, టెక్వాండో కేవలం ఒక క్రీడ మాత్రమే కాకుండా ఆత్మరక్షణకు, శారీరక దృఢత్వానికి, మానసిక ధైర్యానికి బలమైన పునాదిగా పనిచేస్తుందని అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలు స్వీయ రక్షణలో నైపుణ్యం కలిగి ఉండటం అత్యంత అవసరమని ఆయన వివరించారు. చిన్న వయస్సు నుంచే టెక్వాండో శిక్షణ తీసుకోవడం ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిర్ణయాత్మక శక్తి పెరుగుతాయని తెలిపారు.
రణవీర్ మరియు శ్రేయాస్ టెక్వాండో అకాడమీ ద్వారా అనేక మంది విద్యార్థులు క్రీడా రంగంలో రాణిస్తూ ఉన్నారని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీల్లో పాల్గొనేలా కఠినమైన శిక్షణ అందిస్తున్నామని మాస్టర్ రమేష్ తెలిపారు. విద్యార్థినులు మరిన్ని ఉన్నత బెల్ట్‌లను సాధించి దేశానికి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు, శిక్షకులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థినులను అభినందించారు. బాలికల ఆత్మరక్షణకు టెక్వాండో ఎంతో ఉపకరిస్తుందని పేర్కొంటూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు.

## రాయల్ బెంగాల్ పులి మృతి

**భారతీయ వెలుగు -హనుమకొండ:**
హనుమకొండలోని కాకతీయ జూలాజికల్ పార్క్ నేడు ఒక మూగ వేదనకు వేదికైంది. గంభీరమైన నడకతో, ధవళ వర్ణంతో సందర్శకులను మంత్రముగ్ధులను చేసిన 'శరణ్' అనే తెల్ల రాయల్ బెంగాల్ పులి అనంత వాయువుల్లో కలిసిపోయింది. కేవలం ఆరు నెలల క్రితమే ఆశలతో వరంగల్‌కు వచ్చిన ఈ అతిథి, ఇంత త్వరగా వీడుకోలు పలుకుతుందని ఎవరూ ఊహించలేదు.



కాకతీయ జూ చరిత్రలో ఇవేమీ కొత్త విషాదాలు కావు. గతంలో చిరుతపులి శ్రవంతి మరణం, గతేడాది ఎంతో ఆర్భాటంగా వచ్చిన శంకర్ - కరిష్మా జంట అనారోగ్యం పాలై తిరిగి వెళ్ళిపోవడం.. ఇవన్నీ జంతు ప్రేమికులను కలవరపెడుతున్నాయి.

ఎందుకు ఈ వరుస మరణాలు?
జంతువుల మరణాలకు కేవలం అనారోగ్యమే కారణం కాకపోవచ్చు, లోతైన కారణాలు అనేకం ఉంటాయి.
వాతావరణ మార్పు (అక్లిమటైజేషన్): ఒక జూ నుండి మరొక జూకు మారడం జంతువులకు తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగిస్తుంది. హైదరాబాద్ వాతావరణానికి అలవాటు పడిన శరణ్‌కు ఇక్కడి వాతావరణం, నీరు సరిపడకపోవచ్చు.
వృద్ధాప్యం మరియు రోగ నిరోధక శక్తి:
శరణ్ వయస్సు 13 ఏళ్లు. పులులకు ఇది వృద్ధాప్య దశ. ఈ వయస్సులో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయ్యే అవకాశాలు ఎక్కువ. వైద్య మౌలిక సదుపాయాలు:
నెహ్రూ జూలాజికల్ పార్క్ వంటి పెద్ద జూలలో ఉండే అత్యాధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వెటర్నరీ సర్జన్లు లోకల్ జూలలో అందుబాటులో లేకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. పర్యావరణం మరియు రొద:
జూ పరిసరాల్లో పెరిగిన సందడి, జంతువుల సహజ ప్రశాంతతకు భంగం కలిగిస్తే అవి త్వరగా నీరసించిపోతాయి."శరణ్" ఇక లేకపోవచ్చు, కానీ దాని గర్జన కాకతీయ జూ గాలిలో ఎప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే జూ యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

# అభ్యర్థుల చేతికి 'బీ-ఫామ్' అందజేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

- బీ-ఫామ్‌లు అందజేసి.. అభ్యర్థులకు దిశానిర్దేశం చేసిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య
- మున్సిపాలిటీ బాధ్యతను నేను స్వయంగా తీసుకుంటున్నాను
- ఘనపూర్ మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం
- మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయాలి
- నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకైక లక్ష్యం
- మున్సిపాలిటీ పరిధిలోని 18కి 18 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి
- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య







**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 3**
స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మంగళవారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అభ్యర్థుల చేతికి బీ-ఫామ్ లు అందజేశారు. బీ-ఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికారులకు బి-ఫామ్ సమర్పించాలని ఎంపీ సూచించారు. అధికారికంగా పార్టీ తరఫున బీ-ఫామ్‌లు అందాయని పేర్కొన్న ఎంపీ, ప్రభుత్వ ప్రజారంజక పాలన, అమలవుతున్న గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ప్రత్యర్థుల వ్యూహాలను సమర్థంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలోని 18 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపు సాధిస్తారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గ్యారంటీ పథకాలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు.
పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు తమ పార్టీ కట్టుబడి ఉందని, మున్సిపాలిటీ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎంపీ కోరారు. గత పాలకులు స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలిటీ చేస్తానని గత ఎమ్మెల్యే మాటలు చెప్పడమే తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాతే స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.
స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ లో జరుగుతున్న అభివృద్ధిని చూసే ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.
గతంలో వర్షం పడితే స్టేషన్ ఘనపూర్ వరదమయంగా మారేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకుండా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో ఇప్పటికే రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారని చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత మరో రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించారు.
స్టేషన్ ఘనపూర్‌ను ఒక మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని అన్నారు. శివునిపల్లి చాగల్, ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ మున్సిపాలిటీ గెలుపు బాధ్యతను తానే తీసుకుంటానని అభ్యర్థుల గెలుపు కోసం మనందరం కలిసి పని చేద్దామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా చేసుకొని పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే మున్సిపాలిటీకి వచ్చే నిధులు సక్రమంగా వినియోగించుకోవచ్చని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీలోని 18కి 18 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో సాగునీరు, విద్య, వైద్య, వ్యవసాయం, విద్యుత్ రంగాల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు నిరంతరం కృషి చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. గత 15 ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్న స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధికంగా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.1400 కోట్ల నిధులు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే కడియం శ్రీహరి కే దక్కిందన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు రెండు పంటలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. దాదాపు రూ.400 కోట్ల వ్యయంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ఇటీవల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో రూ.45.50 కోట్లతో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందన్నారు.
రైతులు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యను 8 సబ్‌స్టేషన్ల నిర్మాణం ద్వారా పరిష్కరించామని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తూ గ్రామాలలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను అందజేశామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎస్‌డీఎఫ్, ఈజీఎస్, ఎంపీ నిధులతో దాదాపు రూ.35 కోట్ల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, గ్రామ పంచాయితీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పలు దఫాలుగా నిర్వహించిన సర్వేలు, టీపీసీసీ సర్వేల నివేదికల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు.
పార్టీ తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టికెట్ ఆశించి అవకాశం దక్కని ఆశావాహులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో పార్టీ వారికి మరిన్ని అవకాశాలు కల్పిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ
## వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు

- అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు

**భారతీయ వెలుగు హైదరాబాద్,ఫిబ్రవరి 3**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణ రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సచివాలయంలో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహణ

**భారతీయ వెలుగు హైదరాబాద్,ఫిబ్రవరి 3**
డా. బి.ఆర్. అంబెద్కర్ తెలంగాణా సచివాలయంలో ఉదయం ఫైర్ మాక్ డ్రిల్ల్ ను నిర్వహించారు. ప్రమాద వశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అగ్ని మాపక పరికరాలను ఏవిధంగా ఉపయోగించాలి తదితర అంశాలపై నేడు ఉదయం చేసిన మోక్ డ్రిల్ లో వివరించారు. సచివాలయం సీఎస్ఓ దేవీ దాస్, అసిస్టెంట్ కమాండెంట్స్ అప్పాజీ, పవన్ కుమార్, ఏ.డి.ఎఫ్.ఓ జీ.వి. ప్రసాద్, ఎస్.ఎఫ్.ఓ జాన్యాలతోపాటు సచివాలయానికి చెందిన దాదాపు 100 టీ,జి.ఎస్.పి.ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ భేటీ

**భారతీయ వెలుగు హైదరాబాద్,ఫిబ్రవరి 3**
వెనుకబడిన తరగతుల సమగ్ర అధ్యయనంలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాల నుండి బీసీ కమిషన్ సమాచార సేకరణ చేస్తుంది. ఇందులో భాగంగా విద్యా సంబంధిత విషయంలో సమాచార సేకరణ కొరకై సంబంధిత విభాగ అధిపతులతో రేపు కమిషన్ భేటి కానుంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు జరిగే సమావేశంలో విద్యాశాఖకు చెందిన వివిధ విభాగ అధిపతులను ఈ సమావేశానికి హాజరు కావాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల వివరాల సేకరణకు సంబంధించిన అంశాలపై కమిషన్ చర్చించనుంది.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికకు నో అబ్జెక్షన్: సుప్రీం

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గతేడాది ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జతచేస్తూ ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదావేసింది.

# డైరీ రైతుల సమస్యలను లోక్‌సభలో లేవనెత్తిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 3**
వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గానికి చెందిన డైరీ రైతులు, పశుపోషకులు ఎదుర్కొంటున్న సమస్యలను లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రస్తావించారు. ప్రధానంగా వరంగల్ జిల్లాలో పశువుల మేత లభ్యత, వెటర్నరీ సేవల అందుబాటు, పశువుల వ్యాధుల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అధ్యయనం చేసిందా? అని ఎంపీ ప్రశ్నించారు.
మొబైల్ వెటర్నరీ యూనిట్లు (ఎం వి యు ఎస్), నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ డి డి పి), రాష్ట్రీయ గోకుల్ మిషన్, జంతు ఆరోగ్య కార్యక్రమాల కింద వరంగల్ జిల్లాకు అందించిన సహాయంపై వివరాలు కోరారు. అలాగే గత మూడేళ్లలో ఎన్ని గ్రామాలు కవర్ అయ్యాయి, ఎన్ని పశువులకు టీకాలు వేశారు, నేషనల్ అనిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎన్ ఏ డి సి పి) కింద జరిగిన కార్యక్రమాలపై స్పష్టత ఇవ్వాలని వరంగల్ కావ్య పశుసంవర్ధక, మత్స్య, డైరీ శాఖ మంత్రిని కోరారు. డైరీ రైతులకు సమయానికి, న్యాయమైన ధరకు పాల సేకరణ జరిగేలా తీసుకున్న చర్యలు, చిల్లింగ్ సెంటర్లు--ప్రాసెసింగ్ మౌలిక వసతుల బలోపేతం, వ్యాధుల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు చేపట్టిన చర్యలపై కూడా వివరాలు కోరారు.



దీనికి మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లిఖితపూర్వక సమాధానంలో - రాష్ట్ర ప్రభుత్వాల కార్యాచరణ ప్రణాళికల ఆధారంగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. వరంగల్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ప్రత్యేక అధ్యయనం చేసినట్టు పేర్కొనలేదని వెల్లడించారు.
రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద వరంగల్ జిల్లాలో 92,104 పశువులకు ఇన్సెమినేషన్, మొత్తం 1.23 లక్షల కృత్రిమ గర్భధారణలు జరిగాయని, 57,103 మంది రైతులు లబ్ధిపొందినట్లు తెలిపారు. సెక్స్ సార్టెడ్ సీమన్, ఐ వి ఎఫ్ సాంకేతికత, మైత్రీ టెక్నీషియన్లు, ప్రోజెనీ టెస్టింగ్, సీమన్ స్టేషన్ల బలోపేతం వంటి కార్యక్రమాలపై వివరించారు.
గత ఐదేళ్లలో తెలంగాణకు రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద రూ.57.95 కోట్లు, నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డైరీ డెవలప్‌మెంట్ కింద రూ.95.84 కోట్లు, లైవ్‌స్టాక్ హెల్త్ అండ్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ కింద రూ.61.19 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అయితే తెలంగాణకు మంజూరైన 100 మొబైల్ వెటర్నరీ యూనిట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పంపిన కారణంగా ప్రస్తుతం కేంద్ర పథకం కింద ఒక్క ఎం వి యు కూడా పనిచేయడం లేదని వెల్లడించారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాకు ప్రత్యేకంగా అవసరాలపై అధ్యయనం లేకపోవడం, మొబైల్ వెటర్నరీ యూనిట్లు పనిచేయకపోవడం వల్ల రైతులకు సకాలంలో వైద్య సేవలు, మేత సహాయం అందకపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం డైరీ రంగాన్ని బలోపేతం చేసి రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు అందించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

# 5వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 3**
ఈనెల 11న జరిగే వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో.. కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనను ఆదరించి గెలిపిస్తే.. 5వ వార్డు సమగ్ర అభివృద్ధియే వార్డు లక్ష్యంగా పనిచేస్తానని భారీ మెజారిటీతో గెలిపించాలని 5వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి భూక్య స్రవంతి-నరేష్ వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అభ్యర్థి స్రవంతి-నరేష్ మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించడమే తన ప్రథమ కర్తవ్యమని తెలిపారు.
ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను మున్సిపాలిటీ దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి





చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల సంక్షేమం, వృద్ధులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.
తాను ఎన్నికైన తర్వాత ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వార్డు అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతానని చెప్పారు. మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో చూపే నాయకత్వాన్ని ప్రజలు చూడబోతున్నారని దయాకర్ పేర్కొన్నారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని, సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని 5వ వార్డు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేతావత్ మాంగ్యా, బానోతు రమేష్, బానోతు రవి, బానోతు బిక్షపతి, డివిజన్ ప్రెసిడెంట్ రమేష్, సుమన్, మాలోత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.
8

# 2వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చి దిద్దుతాం

» 2వ వార్డు సమగ్ర అభివృద్ధియే లక్ష్యం

**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 3**
ఈనెల 11న జరిగే వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో.. బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిగా నా సతీమణి ప్రమీల పోటీ చేస్తోందని, తమను ఆదరించి గెలిపిస్తే.. 2వ వార్డు సమగ్ర అభివృద్ధియే వార్డు లక్ష్యంగా పనిచేసి, ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని 2వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి భూక్య ప్రమీల బాబూలాల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించడమే తన ప్రథమ కర్తవ్యమని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి





సమస్యను మున్సిపాలిటీ దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల సంక్షేమం, వృద్ధులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.
తాను ఎన్నికైన తర్వాత ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వార్డు అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతానని వారు తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో చూపే నాయకత్వాన్ని ప్రజలు చూడబోతున్నారని పేర్కొన్నారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని, సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని 2వ వార్డు ప్రజలను కోరారు.

# బడ్జెట్లో తెలంగాణకు మరోసారి మొండి చేయి

▪ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్



**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 3**
కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు మరోసారి మొండి చేయి ఇచ్చిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ నవాబ్ ముజాహిద్ అలంఖాన్ మండి పడ్డారు. మంగళవారం బర్కత్ పుర లోని ఆయన నివాసంలో మీడియా తో మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్యాలకు ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదు, హై స్పీడ్ రైలు, కారిడార్లు మినహా ఎలాంటి కేటాయింపు లేదు విభజన హామీలను కూడా పట్టించుకోలేదన్నారు.
మెట్రో రెండోదశ, మూసి పునర్జీవనం, త్రిబుల్ ఆర్ కు నిధులు కూడా కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అవసరాలను వివరించినా ఫలితం లేకుండా పోయిందని ఆయన అన్నారు. వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష 46 వేల కోట్లు అవసరమని ప్రతిపాదనలు ఇచ్చారు.
రాష్ట్రం పంపిన ప్రతిపాదనలో ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం 50 వేల కోట్లు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారని తెలిపారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా రాలేదన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రాజెక్టులను కేంద్రం తుంగలో తొక్కిందని విమర్శించారు. గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే, గోదావరి మూసి అనుసంధానికి ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. ఫ్యూచర్ సిటీ, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పనులకు మొండి చేయి చూపిందన్నారు. రాష్ట్రం కోరిన 8 కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనల మీద స్పందన లేదన్నారు. ఐఐఎం, నవోదయ విద్యాలయాల కోసం విన్నపించిన ఫలితం లేదు గిరిజన వర్సిటీకి కొత్తగా నిధులు కేటాయించలేదన్నారు. విద్యాసంస్థల అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలన్న సీఎం రాష్ట్ర మంత్రుల విజ్ఞప్తులను కేంద్రం పెడచెవిన పెట్టింది, కానీ ఆంధ్రప్రదేశ్ లోని పోలవరం ప్రాజెక్టుకు దండిగా నిధులు కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. మన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు మాత్రం నయా పైసా కూడా ఇవ్వలేదని,
బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై 2014 నుంచి సాగుతున్న నిర్లక్ష్యం కొనసాగిందని, విభజన చట్టంలో ఉన్న ప్రధాన హామీలను కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుంది, బిజెపి ఎంపీలు రాష్ట్ర హక్కుల కోసం ఏనాడూ కృషి చేయలేదన్నారు.
తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర బిజెపి ప్రభుత్వం వివక్ష ఇలాగే కొనసాగితే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే ఆ పార్టీని భూస్థాపితం చేస్తారని ముజాహిద్ అలంఖాన్ అన్నారు.

# ఖాజీపేటలో 'ఫైజాన్ గరీబ్ నవాజ్' మరియు జష్నే దస్తర్బంది కార్యక్రమం

▪ హజ్రత్ అల్లామా అల్హాజ్ ముఫ్తీ సల్మాన్ అజారీ,హజ్రత్ మౌలానా ఖుస్రో పాషా పాల్గొంటారు





**భారతీయ వెలుగు వరంగల్, ఫిబ్రవరి 3**
ఫిబ్రవరి 4వ తేదీ, బుధవారం రాత్రి 8 గంటలకు దర్గా షరీఫ్ హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఆవరణలో దారుల్ ఉలూమ్ హనఫియా గరీబ్ నవాజ్ ఆధ్వర్యంలో జల్సా నిర్వహించబడుతుంది,సజ్జాదా నషీన్ బర్గా అఫ్జాలియా ఖాజీపేటలో ఫిబ్రవరి 3వ తేదీ హజ్రత్ అల్లమా మౌలానా ముహమ్మద్ భక్తియార్ బియాబాని ఆవరణలో ప్రెస్ మీట్ నిర్వహించారు.
ఇందులో భాగంగా 20వ వార్షిక 'ఫైజాన్ గరీబ్ నవాజ్' కార్యక్రమం ఖుస్రో పాషా అల్మరూఫ్ హజ్రత్ అల్లామా మౌలానా సయ్యద్ గులాం అఫ్జల్ బయాబానీ రిఫాయ్ అధ్యక్షతన,సజ్జాదా నాషిన్ బర్గా అఫ్జాలియా ఖాజీపేట్ ఈ సమావేశంలో పాల్గొంటారు, ప్రపంచ ప్రఖ్యాత పీర్ తారీఖత్ హజ్రత్ అల్లామా అల్హాజ్ ముఫ్తీ సల్మాన్ అజారి సాహిబ్ ఖిబ్లా ముంబై (మహారాష్ట్ర) ప్రత్యేక ప్రసంగం చేస్తారు మరియు హజ్రత్ మౌలానా సయ్యద్ ముహమ్మద్ బఖ్తియార్ బియబాని ముఖ్య ప్రసంగం చేస్తారు. ఈ కార్యక్రమంలో హజ్రత్ మౌలానా ముహమ్మద్ అన్వర్ ముషాహిదీ సాహిబ్ (యుపి)హజ్రత్ మౌలానా సాజిద్ రజా షమ్సీ సుల్తాన్‌పూర్ (యుపి),హజ్రత్ అల్లామా మౌలానా ముఫ్తీ మీర్జా ఆసిఫ్ బేగ్ మిస్బాహి,హజ్రత్ అల్లామా మౌలానా అల్హాజ్ ఖ్వాజా జాఫర్ అల్-అజ్లా- జామియా ముహమ్మద్ యే ఖైరుల్ ఉలూమ్ వరంగల్, హజ్రత్ మౌలానా ఖ్వాజా ఫసీహుద్దీన్ నిజామీ వరంగల్,హజ్రత్ మౌలానా ముహమ్మద్ హుసాముద్దీన్ రిజ్వీ ఖాద్రీ వరంగల్,హజ్రత్ మౌలానా ముహమ్మద్ సయీద్ అహ్మద్ రిజ్వీ మెహబూబాబాద్,హఫీజ్ మరియు ఖారీ ముహమ్మద్ తాకీ అన్వర్ తదితరులు ప్రసంగాలు చేస్తారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా హజ్రత్ ముఫ్తీ ముహమ్మద్ షరాఫుద్దీన్ షాఖాఫీ పాల్గొని అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. ఈ సందర్భంగా మదర్సాలోని విద్యార్థులకు పండితులు మరియు మషాయిఖ్‌లు తల పాగాలు కట్టనున్నారు. మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడ్డాయి,మరియు 2000 మందికి పైగా లంగర్ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమానికి విజయవంతం చేయాలని ఆయన ప్రసంగం వినాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా వాసులు ఖాదీములు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క--సారలమ్మ జాతరలో కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల పై ధర్నా చేసిన మైనారిటీ నాయకులు

▪ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం





**భారతీయ వెలుగు ఫిబ్రవరి 3**
హనుమకొండ సోమవారం కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో నిర్వహించిన సమ్మక్క--సారలమ్మ జాతర సందర్భంగా బిఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వరంగల్, హనుమకొండ జిల్లాల మైనారిటీ నాయకులు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట తీవ్ర ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి, కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేసి నిరసన తెలిపారు. అనంతరం జిల్లా మైనారిటీ ఛైర్మన్ మీర్జా అజీజుల్లాహ్ బేగ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా మైనారిటీ ఛైర్మన్ మీర్జా అజీజుల్లాహ్ బేగ్ మాట్లాడుతూ.. సమ్మక్క--సారలమ్మ జాతరలో అమ్మవారు గద్దపైకి రాకముందే ఎమ్మెల్యే తన కుటుంబంతో కలిసి గద్దపైకి ఎక్కడం వల్ల లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. శాంతియుతంగా జాతర నిర్వహించేందుకు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు ప్రోటోకాల్ ప్రకారం వ్యవహరించాలని కోరినప్పటికీ,ఎమ్మెల్యే సూచనలు పట్టించుకోకుండా హుజురాబాద్ రహదారిపై కూర్చొని కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.
ఈ వ్యాఖ్యలు ముస్లిం మైనారిటీల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని,అవి పూర్తిగా అనుచితమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బిఆర్ఎస్ పార్టీ ఆయనను వెంటనే సస్పెండ్ చేసి,ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించాలని కోరారు. జిల్లా మైనారిటీ వైస్ ఛైర్మన్ ఏం.ఎ. షబ్బీర్ (తబ్బు) మాట్లాడుతూ,ప్రజాప్రతినిధిగా,బాధ్యతాయుతంగా,వ్యవహరించాల్సిన ఎమ్మెల్యే పోలీస్ కమిషనర్‌పై ఈ స్థాయిలో కోపం వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యే పదవికి అనర్హుడని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినట్లు మైనారిటీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ నాయకులు,కాంగ్రెస్ నేతలు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 52 శాతం బీఫాంలు ఇవ్వాలి

▪ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్



**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో ఫిబ్రవరి 3**
మున్సిపల్ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 52 శాతం బీఫాంలు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... గత సర్పంచ్ ఎన్నికల్లో బీసీలు జనరల్ స్థానాల్లోనే 52 శాతం విజయం సాధించారని గుర్తు చేశారు. ఇది బీసీల రాజకీయ సామర్థ్యానికి, ప్రజాదరణకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అయినా ఎన్నికలు వస్తే బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం అన్యాయమని ఆయన విమర్శించారు.
దేశ జనాభాలో మెజారిటీగా ఉన్న బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో అన్ని పార్టీలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. మాటలకే పరిమితమయ్యే బీసీ హామీలు ఇకనైనా ఆచరణలోకి రావాలని అన్నారు. బీసీలకు బీఫాంలు కేటాయించకపోతే పార్టీలకు అతీతంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీల రాజకీయ హక్కులు కాపాడాలంటే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల నుంచే న్యాయమైన ప్రాతినిధ్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని గవ్వల భరత్ కుమార్ స్పష్టం చేశారు. బీసీలకు 52 శాతం బీఫాంలు కేటాయించినప్పుడే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచిగారి ప్రవీణ్, బీసీ సంఘం గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షులు అభిలాష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ బిసి యువజన సంఘం అధ్యక్షులు విశాల్ పటేల్, బీసీ సంఘం మేడ్చల్- మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షులు సుమన్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాశ్యప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 4వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చి దిద్దుతాం

» 4వ వార్డు సమగ్ర అభివృద్ధియే లక్ష్యం



**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 3**
ఈనెల 11న జరిగే వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో.. బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిగా నా సతీమణి వసంత పోటీ చేస్తోందని, తమను ఆదరించి గెలిపిస్తే.. 4వ వార్డు సమగ్ర అభివృద్ధియే వార్డు లక్ష్యంగా పనిచేసి, ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని 4వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి వసంత కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించడమే తన ప్రథమ కర్తవ్యమని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను మున్సిపాలిటీ దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల సంక్షేమం, వృద్ధులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.
తాను ఎన్నికైన తర్వాత ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వార్డు అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతానని వారు తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో చూపే నాయకత్వాన్ని ప్రజలు చూడబోతున్నారని పేర్కొన్నారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని, సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని 4వ వార్డు ప్రజలను కోరారు.

# లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కు 5 స్టార్ రేటింగ్

▪ స్కూల్ ప్రిన్సిపల్ బ్రదర్ ఆంటోనీ





**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 3**
ఆబిడ్స్ లోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కు ఇండియా స్టార్ రేటెడ్ స్కూల్ ఆఫ్ ఇండియా 2025 గుర్తింపు కింద ప్రతిష్టాత్మకమైన 5 స్టార్ రేటింగ్ లభించిందని ప్రిన్సిపల్ బ్రదర్ ఆంటోనీ పి తెలిపారు. అదేవిధంగా ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను విద్యారంగ అభివృద్ధి, పాఠశాల సంస్కృతి, ఆదర్శప్రాయమైన ప్రయత్నాలను, గుర్తించి ఈ సంస్థకు మార్గదర్శకులు అనే మరో అవార్డు లభించిందని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపల్ బ్రదర్ ఆంటోనీ పి తరపున ఈ అవార్డును ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ కునాల్ ఆనంద్, శ్రీ గోయాంకాల చేతులు మీదుగా సీనియర్ ఫ్యాకల్టీ కే సంపత్ కుమార్ అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం అబిడ్స్ లోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ప్రిన్సిపాల్ బ్రదర్ ఆంటోనీ పి, సీనియర్ ఫ్యాకల్టీ కే సంపత్ కుమార్ లు అవార్డుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 1వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో 5 స్టార్ రేటింగ్ అవార్డు తమ లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలకు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తమ పాఠశాలలో విద్యా నైపుణ్యం, స్థిరమైన అభివృద్ధి, పట్ల తమ పాఠశాల, నిబద్ధతతో విద్యార్థులకు మెరుగైన విద్యను బోధిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నామన్నారు. ఈ అవార్డు తమ పాఠశాలకు రావడం తమ బాధ్యతను మరింత గుర్తు చేస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని అవార్డులను సాధించేందుకు తాము కృషి చేస్తామన్నారు. ఈ పాఠశాలలో, కరస్పాండెంట్ బ్రదర్ జే కప్, బ్రదర్ అపోలీ డిసోజా, ఉపాధ్యాయుల సమిష్టి కృషితో ఈ అవార్డు లభించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.

# 3వ వార్డు సమగ్ర అభివృద్ధియే నా లక్ష్యం





**హనుమకొండ/ ఫిబ్రవరి 1**
3వ వార్డు ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని 13వ వార్డు వర్ధన్నపేట మున్సిపల్ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అప్సర్ అన్నారు. అంతకుముందు వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాగరాజును నేతలతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అప్సర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాగరాజు సహకారంతో 3వ వార్డులో సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని, మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థి స్పష్టం చేశారు. ప్రజల ప్రాథమిక అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. అలాగే విద్య, ఆరోగ్యం, పేదల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. 3వ వార్డును శుభ్రంగా, సురక్షితంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే విధంగా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, వార్డు అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతానని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని అప్సర్ వార్డు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు ఇన్చార్జి జన్ను అనిల్ కుమార్, సీనియర్ నాయకులు చింత ప్రకాష్, ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు కడారి రణధీర్, 56వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు శనిగరపు అనిత, నాయకులు ప్రభాకర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో ముందుంటా: రాకేష్ గైక్వాడ్

» రాజకీయాలకతీతంగా సమన్వయంతో సమస్యల పరిష్కారం



**భారతీయ వెలుగు చీఫ్ బ్యూరో, ఫిబ్రవరి 3**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అక్క నాయకత్వంలో సోనూ భాయ్ (రాకేష్ గైక్వాడ్) హరి బౌలి డివిజన్‌లోని సమస్యల పై అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక వృద్ధుడికి పింఛన్ అందడం లేదని, మ్యాన్‌హోల్స్ సమస్య ఉందని, రోడ్లు గుంతలుగా ఉన్నాయని, ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. సమస్యలపై అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కారం చేపడతామని ఈ సందర్భంగా రాకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్ష ఆస్థాన, బి.రాజ్‌కుమార్,ఓంకార్ స్వామి,భాను,నిలయ్ భూషణ్ రాయ్,
రష్మీ ఆస్థానా,సురేఖ సక్సేనా,మేఘన,నిఖిల్ అస్థానా,నితేష్ మాథుర్,
ముస్కాన్,నితిన్,శ్రీకర్ శర్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వరంగల్ జూలో తెల్లపులి మృతి

## వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు

నగరంలోని హంటర్ రోడ్డు కాకతీయ జూలజికల్ పార్క్ లో వైట్ టైగర్ (శరణ్) మంగళవారం తెల్లవారుజామున ఎక్లోజర్ లో చనిపోయింది. వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ తో చనిపోయిందని జూ అధికారులు అంటున్నారు. మంగళవారం పులి అంత్యక్రియలు చేసినట్లు జూపార్క్ పర్యవేక్షణ అధికారి మయూరి తెలిపారు. అయితే అధికారుల మెంటనెన్స్ సరిగా లేకనే రెండు రోజులుగా అనారోగ్యానికి గురై చనిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జూ పార్క్ నుంచి తెల్ల పులిని జూలై మాసంలో వరంగల్ తీసుకొచ్చారు. పులి సంరక్షణ సరిగా లేకనే అనారోగ్యానికి గురై మృత్యు వాత పడినట్లు సమాచారం. అధికారులు మాత్రం పులి అనారోగ్యం, గుండె పోటుతో చనిపోయిందని చెబుతున్నారు. జిల్లా అధికారులు పులి మృతి విషయం గోప్యన్గా ఉంచి, అంత్యక్రియల తరువాతనే అనారోగ్యంతో మృతి చెందినదని జూ అధికారి చెప్పడం గమనార్హం.

# శ్రమతో చదవండి .. నగదు పొందండి..

**– ప్రభుత్వ విద్యార్థులకు ఏసీపీ మడత రమేష్ పిలుపు**



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 03:**
శ్రమతో చదివి నగదు పొందాలని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గోదావరిఖని ఏసిపి మడత రమేష్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన మిషన్ 10వ తరగతి అను పోస్టర్‌ను గోదావరిఖని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ మేనేజర్ మల్లెత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏసీపీ మడత రమేష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన "మిషన్ 10వ తరగతి" కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని,ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నారు. రాష్ట్రంలో మొట్ట మొదటి స్థానాన్ని పొందిన విద్యార్థికి రూ.5 లక్షలు,రెండవ స్థానానికి రూ.3 లక్షలు,ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు,119 అసెంబ్లీ ప్రతి నియోజకవర్గ టాపర్ కు రూ.1 లక్ష చొప్పున,అలాగే 612 మండలాలలో టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయ నున్నట్లు సంస్థ యజమాన్యం తెలిపింది. ఈ పథకం తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2026 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వంతో పాటు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సంస్థలు విద్యారంగానికి తోడ్పడటం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఓలు కొట్టే భూమయ్య, అమ్ముల రమేష్, ఎస్ఓలు గుమ్మడి శ్రీనివాస్, జబ్బార్ ఖాన్, సిబ్బంది అప్పల సాగర్, కుత్యం సతీష్, సాధనాల మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకుడు చింత శ్రీనివాస్



**భారతీయ వెలుగు –హుజురాబాద్:**
మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అడుగులు వేస్తుంది. తాజాగా హుజురాబాద్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు,మాజీ కౌన్సిలర్ చింత శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు.పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ హుజురాబాద్ లో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణలేదని,ఎమ్మెల్యే అనాలోచిత నిర్ణయాలకు విసుగు చెందామని,ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అభివృద్ధికోసం నిధులు కేటాయించిందని,తద్వారా మున్సిపల్ ల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

**– భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు**



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంతో పాటు అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 14 15 16 తేదీల్లో జరగనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయంతో పాటు, భీమేశ్వర ఆలయానికి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీల్‌చైర్ సదుపాయంతో నూతనంగా ఏర్పాటు చేసే ర్యాంపును పరిశీలించారు. అలాగే లడ్డూ కౌంటర్, పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్లు, చలువ పందిళ్లు, టెంట్లు, వీఐపీ రోడ్డు, టాయిలెట్స్, శివార్చన వేదిక, నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లు, పార్వతీపురం ధర్మశాల రోడ్డుతోపాటు ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించారు. భీమేశ్వర స్వామి వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కార్యాలయంలో 1000 రూపాయల వేద ఆశీర్వచనం,500 రూపాయలు స్పెషల్ కోడె, 300 రూపాయలు స్పెషల్ దర్శనం టికెట్స్ అందుబాటులో ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు.

**భీమేశ్వర ఆలయంలో అదనపు కలెక్టర్ పూజలు**

శ్రీ భీమేశ్వర స్వామివారిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించగా, ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, ఆలయ డీఈలు మధు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఓలు జయకుమారి, శ్రావణ్ కుమార్, బ్రహ్మన్న గారి శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 28వ వార్డులో జనసేన అభ్యర్థిగా మద్దర్ల కుమారస్వామి నామినేషన్

**– మూడు దశాబ్దాలుగా ప్రజలకు సేవలు**
**– సమస్యల పరిష్కారంతో ప్రజల్లో గుర్తింపు**
**– అభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల బరిలో కుమారస్వామి**

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట, ఫిబ్రవరి02 :**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 28వ వార్డులో జనసేన పార్టీ తరఫున మద్దర్ల కుమారస్వామి నామినేషన్ దాఖలు చేశారు. గత 30 ఏళ్లుగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, వార్డు ప్రజలు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా ఆయనకు మంచి పేరు ఉంది. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల సమస్యలతో పాటు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు సంబంధించిన అనేక వ్యక్తిగత సమస్యల పరిష్కారంలో కుమారస్వామి చురుకుగా వ్యవహరించినట్లు స్థానికులు మన్ననలు పొందారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం పని చేసిన వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. బీ–ఫారం సమర్పించిన అనంతరం కుమారస్వామి మాట్లాడుతూ, "గత మూడు దశాబ్దాలుగా ప్రజల మధ్యే ఉండి వారి కష్టసుఖాల్లో భాగస్వామిని. ఎన్నికల్లో గెలిస్తే 28వ వార్డు అభివృద్ధే ఏకైక లక్ష్యంగా పనిచేస్తాను" అని స్పష్టం చేశారు. జనసేన పార్టీ విధానాలకు అనుగుణంగా పారదర్శక పాలన, ప్రజా సమస్యలపై తక్షణ స్పందనతో ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కుమారస్వామికి మద్దతు ప్రకటించారు.





# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై నిషేధాజ్ఞల కొనసాగింపు

**– అనుమతి లేని డ్రోన్‌లు, డీజే సౌండ్స్‌పై కఠిన చర్యలు**
**– రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు**
**– పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 03:**
సాధారణ పౌరులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మద్యం మత్తులో వీధులు, రోడ్లపై అసభ్య పదజాలంతో మాట్లాడడం వల్ల అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని,ఈ పరిస్థితులకు కళ్లెం వేసి ప్రజల భద్రతను పరిరక్షించేందుకు నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. అలాగే రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నివారించేందుకు భారీ శబ్దంతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఫిబ్రవరి 1 నుండి మార్చి 1వ తేదీ వరకు అమలులో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# క్యాట్ సెకండ్ లెవెల్ లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ




**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**
క్యాట్ సెకండ్ లెవెల్ ఫలితాల్లో వేములవాడ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటారు. గత నెల ఫలితాల్లో అర్హత సాధించిన విద్యార్థులు సెకండ్ లెవెల్ లో ప్రతిభను చాటుకోవడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు కాంపిటీషన్ ఎగ్జామ్స్ కండక్ట్ చేసినందుకు శ్రీ చైతన్య విద్యా సంస్థలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం ముద్రకోల రాజు, అకాడమీకు కోఆర్డినేటర్స్ ప్రవీణ్, మమత,డీన్ అంజయ్య , సి బ్యాచ్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, ప్రైమరీ ఇంచార్జ్ రజిత, ప్రవళిక, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ యషస్విని, హరీష, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్, పిఈటిలు సుధాకర్, మారుతి, కవిత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ లో బ్లడ్ స్లాట్ వ్యాధితో కొత్తూరి సువర్ణ.

**– హుజురాబాద్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత.**
**– బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్.**



**భారతీయ వెలుగు ప్రతినిధి హుజురాబాద్ ఫిబ్రవరి 03,**
హుజురాబాద్ మండలంలోని కనకలగిద్ద గ్రామానికి చెందిన బ్రెయిన్ లో బ్లెడ్ స్లాట్ వ్యాధి తో తీవ్ర అనారోగ్యానికి గురి అయిన కొత్తూరి సువర్ణ–జీవన్ కుమార్ కు హుజురాబాద్ బీసీ జేఏసీ, గౌరీశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రోజు వారి స్వగృహానికి వెళ్లి ఆర్థిక సహాయము అందించడం జరిగినది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవాధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ..పేద కుటుంబానికి చెందిన కొత్తూరు జీవన్ కుమార్ లక్షల రూపాయలు అప్పుగా తెచ్చి గత సంవత్సరము హైదరాబాద్ లోని కేర్ హాస్పిటల్లో మెరుగైన శస్త్ర చికిత్స చేయించినప్పటికీ తన భార్య కొత్తూరి సువర్ణ పూర్తిగా కోలుకోలేదని ఆవేదన వ్యక్తం చేయడం చాలా బాధగా ఉందన్నారు. ఈ విషయం తెలుసుకున్న తాము వారి కుటుంబాన్ని సందర్శించి మా వంతుగా ఆర్థిక సహాయాన్ని అందించినప్పటికీఅనారోగ్యంతో బాధపడుతూ, లేవలేని స్థితిలో ఉన్నటువంటి కొత్తూరి సువర్ణ కుటుంబాన్ని ఆదుకోవ డానికి దాతలు, సంఘ సేవకులు సహృదయంతో ముందుకు రావాలని కోరుతూ 9492300284 సెల్ నెంబర్ కు విరాళాలు పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచుల ఫోరం హుజురాబాద్ మండలం అధ్యక్షులు వన్నాల శివాజీ, గౌరిశెట్టి మధురమ్మ ట్రస్ట్ నిర్వాహకులు గౌరిశెట్టి జగదీశ్వర్, బీసీ జేఏసీ అధ్యక్షులు సందేల వెంకన్న, ప్రధాన కార్యదర్శిఇప్పకాయల సాగర్, తాళ్లపల్లి అమరేందర్, పల్లె సతీష్ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మున్సిపల్ రిజర్వేషన్లలో అంతా అయోమయం

**–కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ బెడద –బుజ్జగింపుల్లో పార్టీ శ్రేణులు**

**భారతీయ వెలుగు , సంగారెడ్డి ప్రతినిధి:**
మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి కావడంతో సంగారెడ్డి జిల్లా అందోలు–జోగిపేట మున్సిపాలిటీలో రాజకీయ దుమారం మొదలయ్యింది. పోటీలో ఉన్న నాయకులు కొన్ని వార్డులలో ప్రచార పోరుకు సిద్ధమయ్యారు. మరికొన్ని వార్డులలో పోటీలో ఉండాలని ఆశించిన వారికి ఆయా రాజకీయ పార్టీల బీఫాంలో అందకపోవడంతో ఆందోళనకరంగా మారడమే కాకుండా వాగ్వాదాలకు దిగే అవకాశాలు మెండుగా కనిపిస్తుండడంతో అధికార కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ బెడద ఉండడంతో ఆ పార్టీ శ్రేణులు తర్జనభర్జన పడుతున్నారు. పార్టీ బీఫాంలు లభించని అసంతృప్తిగా ఉన్న వారిని బుజ్జగింపు పనిలో పడ్డారు. అలాగే బిఆర్ఎస్, బిజెపి పార్టీలలో అంతగా రెబల్స్ ఆరాటం కనిపించడం లేదు. ఏది ఏమైనాప్పటికీ ఎలా జరుగుతాయో వేచి చూడాల్సిందే.

# తేజస్ డిఫెన్స్ లో విద్యార్థులకు ఉద్యోగుల ప్రభంజనం




**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 3**
కరీంనగర్ పట్టణంలో రేకుర్తి లో ఉన్న తేజస్ డిఫెన్స్ నుండి 30 మంది విద్యార్థులకు డిఫెన్స్ రంగంలో ఉద్యోగాలు సాధించారు.15 మంది విద్యార్థులు ఇండియన్ నావి లో, సీనియర్ సెకండరీ రిక్రూట్స్ ఎస్ ఎస్ ఆర్ ఆర్ ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగింది. ఫిబ్రవరి నెల ట్రైనింగ్ సెంటర్ లో రిపోర్ట్ చేయాల్సి ఉంది. 15 మంది విద్యార్థులు ఎస్ఎస్సి జీడి సిఐఎస్ఎఫ్ బిఎస్ఎఫ్ సి ఆర్ పి ఎఫ్ అస్సాం రిఫల్స్ ఉద్యోగాలకు ఎంపిక ద కావడం జరిగింది. తేజస్ నుండి విద్యార్థులు ప్రతిభకనబర్చి ఉద్యోగాలు సాదిస్తునందుకు సంతోషంగా ఉంది అని తేజస్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్ రావు తెలిపారు. విద్యాసంవత్సరం నుండి మహిళలకి కూడా డిఫెన్స్ కోచింగ్ ప్రారంభిస్తున్నామనీ ఐఐటి , నీట్, జేఈఈ విద్యార్థులు ర్యాంకులు సాదించాలని ఎల్విటి ప్రోగ్రామ్ను ప్రారంబించడం జరిగిందనీ , హైదరాబాద్ లోని శ్రీ చైతన్య ఇన్ఫో నెట్ లెర్నింగ్ తో భాగస్వామ్యం కుదుర్చుకున్నాము అని చైర్మన్ తెలిపారు.

# 58వ డివిజన్ బరిలో అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్



**భారతీయ వెలుగు కరీంనగర్ ఫిబ్రవరి 3**

కార్పొరేటర్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు నిజాయితీ, సేవాకార్యక్రమాలు తనబలం అనివెల్లడి కరీంనగర్ నగరపాలక సంస్థ 58వ డివిజన్ కార్పొరేటర్ స్వతంత్ర అభ్యర్థిగా విశ్వనాథ్ చెస్ అకాడమీ డైరెక్టర్ అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు. అనుచరులు, అభిమానులతో కలిసి ఎన్నికల కార్యాలయంలో అవసరమైన పత్రాలను సమర్పించడం జరిగింది. ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రత్యక్ష రాజకీయాలలో అడుగుపెట్టినట్లు తెలిపారు. నిరుపేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల సహాయంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యం అందించారని స్థానికులు గుర్తు చేశారు.ఈ సందర్భంగా అంతగిరి విశ్వనాథ్ ప్రసాద్ మాట్లాడుతూ నిజాయితీతో చేసే సేవలోనే పరమార్థం ఉంది. పదవుల కోసం కాదు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోటీ చేస్తున్నాను. డివిజన్ అభివృద్ధికి పేదల సంక్షేమానికి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.అంబేద్కర్ ఆశయ సాధనలకు అనుగుణంగా మార్పుకు యువతలో చైతన్యం నింపుతున్నట్లు తెలిపారు.

# నాగుర్ల వెంకన్న ను సన్మానించిన ఆరె సంక్షేమ సంఘం నాయకులు

**భారతీయ వెలుగు -హనుమకొండ:**

రైతు ఋణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా హన్మకొండ ఆరె సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగుర్ల వెంకన్న ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... నాగుర్ల వెంకన్న పదవుల కోసం కాదు, ప్రజల కోసం పని చేసే నాయకుడన్నారు. రైతులు, వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపే నాయకత్వం ఆయనదని ప్రశంసించారు. వరంగల్ జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదిగిన ఆయన ప్రయాణం కష్టపడితే నాయకత్వం దక్కుతుందనే సందేశాన్ని యువతకు ఇస్తోందని తెలిపారు. వ్యాపారస్తుల భద్రతే వెంకన్న అజెండా అన్నారు. రైతుల ప్రయోజనాలను



ముందుంచి పనిచేసే నాగుర్ల వెంకన్న నాయకత్వంలో, నాణ్యమైన విత్తనాలు ఎరువులు, పురుగుమందులు రైతులకు అందించి, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతు ఋణ విమోచన కమిషన్ చైర్మన్‌గా ఉన్న సమయంలో రైతుల బాధలను అర్థం చేసుకొని తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపును తెచ్చాయన్నారు. ఇప్పుడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ వ్యాపార వర్గాలకు మరింత బలమైన గొంతుగా నిలుస్తారని వెంకన్న నాయకత్వం రాష్ట్రానికే ఆదర్శం కావాలి అన్నారు. పదవికంటే సేవ గొప్పది అలాగే, ఆరె సమాజ ఐక్యతకు, సామాజిక న్యాయ సాధనకు నాగుర్ల వెంకన్న నాయకత్వం మరింత దోహదపడుతుందన్నారు. ఆయన నాయకత్వంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం అవుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కొల్లూరి కందేరావు, పేర్వాల లింగమూర్తి, వాడికారి బాబురావు, నాగుర్ల సంతోష్, గురుజాల నిరంజన్ రావు, లోనే దీపక్ జి, హింగే భాస్కర్, వరికెల కిషన్ రావు, కరాబు రాజేశ్వర్ రావు, రంపీస మనోహర్, సిరిసె చందర్ రావు, అదరసాండే చందర్ రావు, తుమ్మనపల్లి రామేశ్వర రావు, వాడికారి లక్ష్మణ్ రావు, కుడ్ల సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు పరిశుభ్రమైన, నాణ్యతా లడ్డు ప్రసాదాలు

**- లడ్డు సత్రంలో పారిశుధ్య చర్యలు**
**- సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ కుమార్**



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**

రాజన్న భక్తులకు పరిశుభ్రమైన, నాణ్యతతో కూడిన లడ్డు ప్రసాదాలు అందించడమే తమ లక్ష్యమని లడ్డు విభాగం సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ కుమార్ తెలిపారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 14 15 16తేదీల్లో జరుగు మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని సోమవారం లడ్డు సత్రంలో 1500కు పైగా లడ్డు ట్రేలు, పాత్రలను వేడి నీరు, సర్ఫ్ ఉపయోగించి శుభ్రపరచడం తదితర పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ పనులను ఆలయ లడ్డు సత్రం ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టగా, పనుల పనితీరును సీనియర్ అసిస్టెంట్ ప్రత్యక్షంగా పరిశీలించారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో డివిజన్స్ మీటింగ్

**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 03:**

రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతినగర్ (60వ డివిజన్), విఠల్ నగర్ (12వ డివిజన) లో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్స్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్‌ను పాటించాలి, గొడవలు, సోషల్ మీడియా లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, సందేశాలు చేయడం, వ్యక్తిగత దుషణలు, అక్రమ, అసత్య ప్రచారం చేయరాదని సూచించారు. ప్రభుత్వం కార్యాలయాలకు, దేవాలయాలకు, మసీద్ లకు ఎలాంటి వాల్ పోస్టర్స్ అంటించడం, వాల్ రైటింగ్ రాయడం చట్టరీత్యా నేరం, కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మీ డివిజన్ పరిధిలో ప్రైవేట్ ఇంటి గోడలపై ప్రచారం కి సంబందించిన వాల్ పోస్టర్స్ అంటించడం, వాల్ రైటింగ్ రాయడం చేస్తే ఇంటి యజమాని అనుమతి తీసుకోవాలన్నారు.



ప్రచారం 6:00 రాత్రి 10:00 గంటలకు ముగించాలి. మైక్ ఉపయోగిస్తే తప్పనిసరిగా పర్మిషన్ తీసుకోవాలని, ప్రచారం చేసే సమయంలో ర్యాలీ లకు ముందస్తు అనుమతి తీసుకోవాలి. ర్యాలీ సమయం తెలిపినచో అందరూ అభ్యర్థులకు అవకాశం కల్పించేలా, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనియా సంఘటనలకు తావులేకుండా భద్రత చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల కు 100 మీటర్లు దూరం లో ఉండాలి, కేంద్రం వద్ద కండువాలు ధరించి ప్రచారం చేయకూడదు. గుంపులు గుంపులుగా ఉండకూడదని, ఓటు వేయడానికి వెళ్లే సమయంలో మొబైల్ ఫోన్ పోలింగ్ కేంద్రం లోకి తీసుకెళ్ల కూడదని, ఓడిపోయిన, గెలిచిన అభ్యర్థులు, వారి అనుచరులు ఎవరిని కించపరిచే విధంగా, అసభ్యకరంగా మాట్లాడకూడదన్నారు. ప్రజలు గెలిపించి ఇచ్చిన అవకాశంను ప్రజా సమస్యల గురించి, అభివృద్ధి గురించి అందరితో కలిసి పనిచేయాలి అన్నారు. ఫిబ్రవరి 16వ తేదీ వరకు ఎన్నికలు కోడ్ ఉంటుంది కనుక ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, టపాకాయలు కాల్చడం చేయకూడదన్నారు. ప్రతి ఒక అభ్యర్థి వారి వారి అనుచరులకు ముందస్తు ఆదేశాలు, హెచ్చరికలు చేస్తూ, వారిని గమనిస్తూ ఉండాలని, అని ఎవరైనా అనుచరులు ఎన్నికల నియమాల ఉల్లంఘనలకు పాల్పడితే, అభ్యర్థులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఎలాంటి సమస్యలు ఎదురైన వెంటనే పోలీస్ కు, ఎన్నికల అధికరులకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ఎన్నికలు శాంతియుతంగా నిర్భయంగా, నిబద్ధతతో నిర్వహించేలా, ప్రజలు అభ్యర్థులు పోలీస్ సహకరించగలరని, ఎన్నికల నిర్వహణకి అన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ డివిజన్ మీటింగ్‌లో ఎస్ఐ రమేష్, అనూష, స్థానిక కాలనీ వాసులు, ప్రజాప్రతినిధులు, క్రైమ్ సిబ్బంది, బ్లూ క్లోట్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 52వ డివిజన్ లో గెలుపు దిశగా వ్యాపారవేత్త రాజేష్ శర్మ





**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని ఫిబ్రవరి 03:**

పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో 52వ డివిజన్ నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ప్రముఖ వ్యాపారవేత్త రాజేష్ శర్మ ఎన్నికల బరిలో నిలిచారు. డివిజన్ పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించిన రాజేష్ శర్మ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ.. తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వ్యాపారవేత్తగా అనుభవం ఉన్న తనను గెలిపిస్తే డివిజన్ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మౌలిక వసతుల మెరుగుదల, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, గెలుపు దిశగా బీజేపీ ముందుకెళ్తోందని పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# డిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఈ నెల 23న ఓసిల జాతీయ మహాధర్నా

**- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కి ఆహ్వాన పత్రిక అందజేసిన పోలాడి రామారావు**

**భారతీయ వెలుగ హుజురాబాద్:**

ఓసి జేఏసీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈనెల 23 న నిర్వహించే జాతీయ స్థాయి ఓసి ల మహా ధర్నాకు హాజరుకావాలని కోరుతూ హుజురాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ల కు మంగళ వారం హుజురాబాద్ లో ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో నాయకుల తో కలిసి ఓసి సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలాడి రామారావు మాట్లాడుతూ ఓసి ల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 23 న డిల్లీలో జాతీయ స్థాయి ఓసి ల



మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేద ఓసి లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత రాజకీయాల్లో జనరల్ స్థానాల్లో సైతం ఓసి లు తట్టుకోలేనిపరిస్థితి నెలకొన్న విషయాన్ని పాడి కౌశిక్, బండ శ్రీనివాస్ ల దృష్టికి తెచ్చారు. జనరల్ స్థానాల్లో కూడా ఓసి లకు రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వక పోవడం వల్ల రాజకీయంగానూ వెనుకబడి పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు . ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి కేంద్రం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పిస్తే ఓటు బ్యాంక్ రాజకీయాలతో వాటి పైన దుష్ప్రచారం చేయడం తగదన్నారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని అన్ని వర్గాల పేదలకు ఆర్థిక స్థితి గతుల ఆధారంగా సమన్యాయం జరగాలన్నదే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. అట్టడుగున ఉన్న ప్రతి పేదవాడికి న్యాయం జరగడానికి ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని ఇందుకు రాజ్యాంగ సవరణ చేయటానికి ప్రత్యేక చట్టం తీసుకు రావాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామారావు వెంట వణ్యాల భూపతి రెడ్డి, ఎడవెల్లి కొండాల్ రెడ్డి, పోల్సాని రామారావు గందే శ్రీనివాస్, కసిరెడ్డి నర్సింహారెడ్డి,మల్లారెడ్డి, చందుపట్ల నరసింహ రెడ్డి, కంకణాల జనార్ధన్ రెడ్డి, గౌతం శర్మ తదితరుల తో పాటు హుజురాబాద్ నియోజక వర్గ ఓసి జేఏసీ వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ బరిలో 113 మంది

**- 37 నామినేషన్ల ఉపసంహరణ - 28 వార్డుల్లో తేలిన అభ్యర్థుల జాబితా**




**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**

2026 మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో భాగంగా వేములవాడ పురపాలక సంఘం ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. మంగళవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. వేములవాడ పట్టణంలోని మొత్తం 28 వార్డులకు గాను తొలుత 150 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి వివిధ కారణాలతో 37 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. దీంతో ప్రస్తుతం 28 వార్డుల్లో కలిపి మొత్తం 113 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు అధికారికంగా ఖరారు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ పర్వం ముగియడంతో ఇక ప్రధాన పార్టీల మధ్య ప్రచార పర్వం ఊపందుకుంది.వార్డుల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో, అభ్యర్థుల తుది జాబితా వెలువడడంతో పట్టణంలో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

# కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన హైదరాబాద్ షామియా చాకో స్పోకెన్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీ

**- విద్యార్థులు పదవ తరగతి పూర్తి అయిన తర్వాత మంచి కెరీర్ పెంచుకోవాలి అని తెలిపిన**
**- పాఠశాల ప్రధానం ప్రధానోపాధ్యాయులు సాంబయ్య**

**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి ఫిబ్రవరి 3**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోనిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి,పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమాన్ని షామియా చాకో స్పోకెన్ ఇంగ్లీష్ ఫ్యాకల్టీ హైదరాబాద్ వారు నిర్వహించారు. 10వ తరగతి తర్వాత సరైన కెరీర్‌ను ఎంచుకోవడం అనేది మీ జీవితంలో అత్యంత కీలకమైన నిర్ణయం. 2026లో మారుతున్న టెక్నాలజీ అవకాశాలను బట్టి, మీరు కేవలం ఇతరులను చూసి కాకుండా మీ ఆసక్తిని బట్టి నిర్ణయం తీసుకోవాలి.

- పది తర్వాత అందుబాటులో ఉన్న



ప్రధాన మార్గాలు గురించి తెలియజేశారు.

- ఇంటర్మీడియట్ దీనిని
- చాలా మంది విద్యార్థులు ఎంచుకునే సాధారణ మార్గం ఇది. ఇందులో ప్రధానంగా
- సైన్స్ స్ట్రీమ్,ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, డిఫెన్స్ లేదా డేటా సైన్స్ వైపు వెళ్లాలనుకునే వారికి ఉత్తమం.బైపిసిడాక్టర్, ఫార్మసీ, అగ్రికల్చర్, లేదా బయోటెక్నాలజీ లక్ష్యంగా ఉన్నవారికి.కామర్స్ స్ట్రీమ్,
- బిజినెస్, అకౌంట్స్, ఫైనాన్స్ మీద ఆసక్తి ఉంటే ఇది సరైనది. , సి ఏ సి ఎస్ లేదా ఎంబీఏచేయాలనుకునే వారికి ఇది పునాది. సివిల్ సర్వీసెస్, లా, జర్నలిజం, సైకాలజీ లేదా డిజైనింగ్ రంగాల్లో ఆసక్తి ఉన్నవారికి ఇది చాలా మంచిది.పాలిటెక్నిక్ డిప్లొమా, టెక్నికల్ రంగంలో త్వరగా స్థిరపడాలనుకునే వారికి ఇది బెస్ట్ ఆప్షన్.ఇది పూర్తి చేసిన ఐటిఐ వారికి త్వరగాఉపాధిపొందాలనుకునే విద్యార్థులకు ఇది ఒక వరం.ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబర్, డీజిల్ మెకానిక్ వంటి వృత్తి విద్యా కోర్సులు ఉంటాయి.రైల్వేలుప్రభుత్వ రంగ సంస్థల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇవి చాలా ఉపయోగపడతాయి.

వొకేషనల్ కోర్సులు, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి ప్రత్యేక రంగాల్లో తక్షణ శిక్షణ కోసం వీటిని ఎంచుకోవచ్చు. సరైన కెరీర్‌ను ఎలా ఎంచుకోవాలి మీ ఆసక్తిని గుర్తించండి: మీకు లెక్కలు ఇష్టమాసైన్స్ ప్రయోగాలు ఇష్టమా లేక సమాజం వ్యాపారం గురించి తెలుసుకోవడం ఇష్టమా అని ఆలోచించండి.

బలాలు బలహీనతలు: ఒక సబ్జెక్టులో మార్కులు తక్కువ వస్తున్నాయంటే, కేవలం ట్రెండ్ కోసం ఆ స్ట్రీమ్ తీసుకోకండి.భవిష్యత్తు అవకాశాలు: 2026 నాటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ మార్కెటింగ్ డేటా అనలిటిక్స్ వంటి రంగాలకు డిమాండ్ పెరుగుతోంది. కాబట్టి నీకు తోచిన రంగాల్లో పదవ తరగతి తరువాత చేరి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సాంబయ్య మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతి పూర్తి అయిన తర్వాత మంచి కెరీర్ ఎంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, నరసింహారెడ్డి, చార్లెస్, అమూల్య, సునీత,పద్మజ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దేవరకొండ మున్సిపాలిటీ 20కి 20వార్డులకు కాంగ్రెస్ అభ్యర్థులకు బీ--ఫారాలు అందజేసిన :ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

భారతీయ వెలుగు న్యూస్ ఫిబ్రవరి. 3.దేవరకొండ. నల్గొండ. జిల్లా

రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నేడు దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 20 వార్డుకు 20 మంది అభ్యర్థులకు పార్టీ బీ--ఫారాలను నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత తో కలిసి వార్డు అభ్యర్థులకు బీ - ఫారాలు అందజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పార్టీ బీ--ఫారాలను అందజేసి, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలను గడపగడపకు తీసుకెళ్లి, కాంగ్రెస్ పార్టీ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు.దేవరకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన దృష్టికోణంతో ముందుకు సాగుతోందని, ప్రజల ఆశీర్వాదాలతో ఈ ఎన్నికల్లో అన్ని వార్డులలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజల మద్దతు పొందాలని ఆకాంక్షించారు.దేవరకొండ మున్సిపాలిటీలో వందశాతం కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తారు. దేవరకొండలో తప్పకుండా చైర్మన్



పీఠాన్ని కైవసం చేసుకుంటాం. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎలాగైతే కష్టపడి కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చారో, అదేవిధంగా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయాలి అని అన్నారు. మున్సిపాలిటీలకు ఇచ్చే ప్రతి హామీని నెరవేర్చి, అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది.

.వార్డు సభ్యుల పేర్లు

1.పొన్నబోయిన భూదేవి సైదులు
2. అంకూరి శివ ప్రసాద్
3.అంకురి సుమలత - రాజేష్
4.మహ్మద్ రయీస్
5.గోవిందు పద్మ - జగతయ్య



6.యండి. యూనుస్
7.హన్మంతు సాయి చంద్ర గౌడ్
8.కేతావత్ అజయ్
9.నలగాసు మంగ - విజయ్ యాదవ్
10.గుద్దేటి మాధవి సత్యనారాయణ
11.షేక్ నవీద్
12.బిజిలి అంకులమ్మ - యాదయ్య
13.పులిజాల చందన- ఆదిత్య
14.గాజుల సావిత్రి - మురళి
15.జువేరియా తబస్సుం - మహమ్మద్ నవాజ్ అహ్మద్
16.ముడావత్ జయప్రకాష్(జేపీ)
17.ఏకుల కరుణాకర్
18.ఉప్పల శ్రీనివాసులు
20.పున్న శైలజ వెంకటేశ్వర్లు (చైర్ పర్సన్ అభ్యర్థి)

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్ అధ్యక్షుడిగా నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక

●రైతు సమాజానికి మేలు చేస్తుంది, హింగే భాస్కర్

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 03 భారతీయ వెలుగు

తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడంతో ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.మంగళవారం ఎల్కతుర్తి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుఖినే సంతాజి, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్,హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి కోదాటి మాధవరావు తదితర నాయకులు హనుమకొండలోని నాగూర్ల వెంకటేశ్వర్ల నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి పూల బొకే అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్



మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించడంలో ఫర్టిలైజర్ షాపుల వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన పదవికి నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడం రైతు సమాజానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను గుర్తించి సమర్థవంతంగా పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఫర్టిలైజర్ రంగంలో ఉన్న అనుభవం, సేవాభావం, నాయకత్వ లక్షణాలతో నాగూర్ల వెంకటేశ్వర్లు ఈ పదవికి పూర్తిగా న్యాయం చేస్తారని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా కమిటీ విశ్వాసం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళా వైద్య దినోత్సవంలో డా. శ్రీదేవి భావోద్వేగ వ్యాఖ్యలు

●గ్రామీణ ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యం

ఎల్కతుర్తి పిబ్రవరి 03 భారతీయ వెలుగు )

ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో వైద్యురాలు డా. శ్రీదేవి తన వృత్తి అనుభవాలను హృదయ పూర్వకంగాపంచుకున్నారు.చిన్నతనం నుంచే వైద్యురాలవ్వాలన్న తన ఆశయానికి తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందించారని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. వారి ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి చేరుకోగలిగానని పేర్కొన్నారు. గత 18 ఏళ్లుగా వైద్య వృత్తిలో కొనసాగుతుండటం తనకు ఎంతో సంతృప్తి, ఆనందాన్ని ఇస్తోందని తెలిపారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం తన వృత్తిలో లభించిన గొప్ప అనుభూతిగా అభివర్ణించారు. ప్రతి ఆడపిల్ల వైద్య విద్యను అభ్యసిస్తే సమాజానికి, ముఖ్యంగా మహిళలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందుతాయని అన్నారు. మహిళా వైద్యులు ఎక్కువైతే మహిళలు తమ ఆరోగ్య సమస్యలను



ధైర్యంగా వెల్లడించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొని మహిళా వైద్యుల సేవలను కొనియాడారు. మహిళా వైద్యుల కృషి సమాజ ఆరోగ్య అభివృద్ధికి ఎంతో కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు.

# సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించిన ఇద్దరు పోలీస్ అధికారుల పదవీ విరమణ

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి భారతీయ వెలుగు న్యూస్ ఫిబ్రవరి 3

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులుయాకూబ్ అలీ, ఎస్.ఐ (డీ.సీ.ఆర్.బీ)1984 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి 43 సంవత్సరాల ఘనమైన పోలీస్ సేవలు అందించారు.బోడ తులసయ్య 1990లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి2023లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది మొత్తం 36 సంవత్సరాల సేవలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ - - పదవీ విరమణ పొందుతున్న అధికారులకు తమ తరపున మరియు మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ



తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.యాకూబ్ అలీ గారు 1984 బ్యాచ్‌కు చెందినవారై, సుమారు 43 సంవత్సరాల పాటు శాంతి భద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో, ప్రజా సేవలో విశేష సేవలు అందించారని ప్రశంసించారు. అదేవిధంగా బోడ తులసయ్య 36 సంవత్సరాల పాటు శాఖకు అంకితభావంతో సేవలందించి విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచారని అభినందించారు.పదవీ విరమణ అనేది జీవితంలో కొత్త అధ్యాయమని, మిగిలిన జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని సూచించారు. నిత్యం ఏదో ఒక వ్యాపకంతో చురుకుగా ఉండాలని కోరారు.రిటైర్మెంట్ అనంతరం లభించే బెనిఫిట్స్‌ను ప్రభుత్వ బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో భద్రపరుచుకోవాలని, అధిక లాభాల ఆశ చూపే మోసగాళ్ల పట్ల మరియు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.పదవీ విరమణ పొందిన వారిని కుటుంబ సభ్యులు గౌరవప్రదంగా చూసుకోవాలని, వారి మానసిక ప్రశాంతతకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ నాగేశ్వర్ రావు, ఆర్. ఐ సోములు, డీ.సీ.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఉపేంద్ర రావు సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దొంతర బోయిన మల్లయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

●సర్పంచ్ వర్స దీప ప్రకాష్ దొర

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి భారతీయ వెలుగు న్యూస్ జనవరి 3

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నామాలపాడు గ్రామపంచాయతీలోని రావికుంట గ్రామానికి చెందిన దొంతర బోయిన మల్లయ్య సతీమణి యాకమ్మ ఇటీవల కాలంలో మరణించడం జరిగింది వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండమని చెప్పి భరోసానిచ్చి ఆర్థిక పరిస్థితిని చూసి దశదిన కర్మలకు సర్పంచ్ వర్స దీపప్రకాష్ దొర సహృదయంతో 50 కేజీ ల బియ్యం,2000 రూపాయల ఆర్థిక సాయం చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో వారి కుమారుడు దొంతరబోయిన నాగరాజు, వార్డ్ నెంబర్స్ గొగ్గల రామకృష్ణ,చీమల



కృష్ణ,గుండా సుమలతసుధాకర్, తెగుళ్ల నందినివీరభద్రం,కొత్తపేట మాజీ సర్పంచ్ ఇర్ప మమత రాజేష్, గ్రామస్తులు:ఊకె రామ్మూర్తి,తుర్సం యర్రయ్య, వర్స పరమేష్, బత్యం వెంకటేష్, కోరెం జంపన్న,సురబోయిన రాంబాబు,బసనబోయిన వెంకన్న,చెన్నబోయిన వేణు , వర్స సంపత్,పులుగుజ్జు రాజు, గుంపిని సమ్మయ్య, బత్యం భాస్కర్,శీలం వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణకు అవగాహనే కీలకం

●జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ.

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, భారతీయ వెలుగు న్యూస్ ఫిబ్రవరి 3

మహబూబాబాద్ జిల్లాలో ?మారుతున్న జీవనశైలి, మానసిక ఒత్తిడి, ఆహార కల్తీ వంటి కారణాల వల్ల విస్తరిస్తున్న క్యాన్సర్ మహమ్మారిని అరికట్టడానికి సామాజిక అవగాహనే కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు.?మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా అన్నం, ఉప్మా వంటి పదార్థాలు అడుగు భాగంలో మాడిపోయినప్పుడు వాటిని తినకూడదన్నారు.మొక్కజొన్న కంకులను నల్లగా కాల్చుకుని తినడం ఆరోగ్యానికి హానికరం.ఇలా మాడిపోయిన పదార్థాలలో కర్బన, జనిత





రసాయనాలు ఉంటాయని, ఇవి క్యాన్సర్‌కు కారకాలుగా మారుతాయని హెచ్చరించారు. మూడు కిలోల పల్లీల నుంచి కేవలం ఒక లీటర్ ఆయిల్ మాత్రమే వస్తుందని, మరి కంపెనీలు అంతకంటే తక్కువ ధరకే పల్లీ నూనెను ఎలా విక్రయిస్తున్నాయో ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని కోరారు.అనంతరం ?జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శాలిని షాకెల్లి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలలో వేడి పదార్థాలు లేదా పానీయాలు ఉంచి తీసుకోవడం వల్ల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రజల్లో చైతన్యం కల్పించేందుకే ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి, సరైన వైద్యం తీసుకోవడం ద్వారా ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని క్యాన్సర్ కారకాలపై అవగాహన కల్పించారు.పట్టణ డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ ప్రజలందరూ క్యాన్సర్ కారకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి ఏ. కృష్ణతేజ్, ప్రభుత్వ న్యాయవాదులు టి. నగేష్ కుమార్ , సునీత, పబ్లిక్ ప్రాసెక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య,పోలీస్ అధికారులు మహేందర్ రెడ్డి, సర్వయ్య,నలంద కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ మరియు వికాస్ కళాశాల విద్యార్థులు, న్యాయశాఖ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో న్యాయ శాఖ ఉద్యోగులు, పార లీగల్ వాలంటీర్లు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ సైనికుడు హరి నారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా

## -- అలాయి--బలాయి టీం ఆధ్వర్యంలో నిర్వహణ

ఉప్పల్03 ఫిబ్రవరి, భారతీయ వెలుగు న్యూస్

మాజీ సైనికుడు హరి నారాయణ జన్మదిన వేడుకలను అలాయి--బలాయి టీం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు కేక్ కటింగ్ కార్యక్రమాన్ని చేపట్టి, హరి నారాయణను శాలువాతో సత్కరించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడుతూ, ఆయనకు ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, రఘునాథ్ శంకర్ గౌడ్, భాస్కర్ రెడ్డి, అజయ్, విజయ్, నాగరాజు, శర్మ,



సంగమేశ్వర్ బసప్ప, మాధవ్ యాదవ్, భాస్కర్ చారి, అమర్నాథ్ గౌడ్, మోహన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి గుర్తింపు లేదు....

## కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా

●పార్టీకి పనిచేయని వారికి కాంగ్రెస్ టికెట్లు

కోరుట్ల నియోజకవర్గం భారతీయ వెలుగు న్యూస్ ఫిబ్రవరి 3 :

మెట్ పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీలో పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు లేదని. పార్టీ కోసం పనిచేయని వారికి టికెట్లు ఇవ్వడంతో నిరూపితం అయ్యిందని కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ కి గత ముప్పై సంవత్సరాలు గా సేవ చేస్తున్నానని.పట్టణ మున్సిపల్ ఎన్నికల్లో 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తే పార్టీ కి ఎలాంటి సేవ చేయని వారికి టికెట్ ఇచ్చారన్నారు. పార్టీ కార్యకర్తగా, పార్టీ పట్టణ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ ఉనికి కాపాడుతూ. గత 10 సంవత్సరాల బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో ప్రతి పక్ష హోదాలో ఉండి అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలు చేశానని, ఎన్నోసార్లు అర్ధరాత్రి పూట అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ లో




ఉంచారని పార్టీ కోసం కేసులు కూడా నమోదు అయ్యాయని అన్నారు. పార్టీ కోసం కష్ట పడిన తనను కాదని పార్టీకి ఎలాంటి సంబంధం లేని వ్యక్తిని తీసుకువచ్చి తన స్థానంలో పార్టీ బీ ఫామ్ ఇవ్వడం అన్యాయం అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ టికెట్ తీసుకున్న వ్యక్తి కాంగ్రెస్ పార్టీ లో ఉండి గతంలో పార్టీ అభ్యర్థుల పై రెబల్ గా పోటీ చేయడమే కాకుండా, ఇతర పార్టీ వ్యక్తికి మద్దతు తెలిపాడని ఆరోపించాడు. పార్టీ తన కష్టాన్ని, పార్టీకి చేసిన సేవను గుర్తించపోయిన తాను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్నికల నుండి తప్పుకుంటున్నానని పాషా తెలిపాడు.

# చట్టాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు,,

భారతీయ వెలుగు న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3:

చట్టాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని భీమారం ఎస్సై ఏ. రాజేందర్ అన్నారు, ఎస్సై ఏ. రాజేందర్ మాట్లాడుతూ భీమారం మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ పున్నం అనే వ్యక్తి పోలీస్ శాఖకు చెందిన డయల్ 100 కు పదే పదే ఫోన్ చేస్తూ పోలీస్ వారి సమయాన్ని వృధా చేస్తున్నందున, అతనిని అదుపులోకి తీసుకుని చెన్నూర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పర్వతపు రవి ముందు ప్రవేశపెట్టగా చట్టాన్ని దుర్వినియోగం చేసినందుకు నిందితునికి పది రోజుల జైలు శిక్ష విధించినట్టు, నిందితున్ని రిమాండ్ నిమిత్తం లక్షెట్ పేట సబ్ జైలుకు తరలించినట్టు తెలిపారు, వారి వెంట పోలీస్ హెడ్ కానిస్టేబుల్ మాచర్ల, హోంగార్డ్ సంతోష్ ఉన్నారు



# నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలి,

**●మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్,**

భారతీయ వెలుగు న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి

ఫిబ్రవరి 3, 2026:





2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నిర్వహించిన నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా తయారీ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా చేపట్టాలని, నిర్దేశిత సమయంలోగా ప్రక్రియ పూర్తి చేసి నిబంధనల ప్రకారం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తిగా వీడియోగ్రఫీ చేయడం జరిగిందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం భవన నిర్మాణ పనులను సందర్శించి వంటశాల, ఇతర పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు.తదనంతరం కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు మంజూరైన భోజనశాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని రేగులగూడ గ్రామంలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలకు మంజూరైన అదనపు గదుల నిర్మాణ ప్రక్రియను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలు,కౌంటింగ్ సెంటర్ ను పరిశీలించిన మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు





**●ఎన్నికల పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్, ఐఏఎస్.**

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, భారతీయ వెలుగు న్యూస్ ఫిబ్రవరి 3

మహబూబాబాద్

జిల్లా వ్యాప్తంగా (5) మున్సిపల్ పరిధిలోని మహబూబాబాద్, కేసముద్రం, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ లలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియన ఏర్పాట్లను మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం, సెంట్ అగస్టిన్ హై స్కూల్ కౌంటింగ్ కేంద్రం ను పరిశీలించారు, ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం అధికారులు పక్కాగా సౌకర్యాలను కల్పించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రారంభం ముగిసే వరకు రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు త్రాగునీరు, చైర్స్, టెంట్స్, దివ్యాంగుల కోసం వీల్ చైర్స్, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వైద్య బృందం ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు,పోలింగ్ ముగిసిన అనంతరం కౌంటింగ్ కేంద్రానికి తరలించే క్రమంలో రిటర్నింగ్ అధికారులు పోలీస్ భద్రతా సిబ్బంది మధ్య పోలింగ్ బాక్సులు తరలించాలని, అభ్యర్థులకు సంబంధించి ప్రచార ముందస్తు అనుమతులు, ఖర్చుల వివరాలు, తదితర అనుమతులను సమయం లోగా తీసుకునే విధంగా అభ్యర్థులకు విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు,మరిపెడ కేంద్రంలోనీ సెంట్ ఆగస్టిన్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు, కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు,జనరల్ అబ్జర్వర్ వెంట నోడల్ ఆఫీసర్ కృష్ణవేణి, స్థానిక మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది కృష్ణ ప్రసాద్, ప్రవీణ్ ఉన్నారు.

# పంట ఉత్పత్తుల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి,

**●మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

భారతీయ వెలుగు న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి

ఫిబ్రవరి 3, 2026: మంచిర్యాల



జిల్లాలో వరి ధాన్యం, పత్తి పంటల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తో కలిసి జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, మెప్మా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో వరి ధాన్యం, పత్తి పంటల కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో పత్తి పంట దిగుబడి అంచనా వేయాలని, తదనగుణంగా కొనుగోలు కొరకు ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు కొనుగోలు ప్రక్రియలో భాగంగా రైతులకు టోకెన్లు జారీ చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా కొనుగోలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 1 లక్ష 23 వేల ఎకరాలను పత్తి సాగు చేసే అవకాశం ఉందని, పంట దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కొరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని, జిల్లాలోని రైస్ మిల్లులకు 1 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉందని తెలిపారు. పంట ఉత్పత్తులను రైతుల వద్ద నుండి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేసి సకాలంలో సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో పంట ఉత్పత్తుల కొనుగోలు కొరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కేంద్రాల ఏర్పాటులో నిబంధనలను పాటించాలని తెలిపారు. పంట విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని, టార్పాలిన్లు, గోనె సంచులు, తేమ, తూకం యంత్రాలు అవసరమైన మేర సమకూర్చాలని, హమాలీల సంఖ్య అనుగుణంగా ఉండేలా పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హత గల రైతులకు అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన వసతి గృహ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి,





**●సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్**

భారతీయ వెలుగు న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 3, 2026: గిరిజన

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ – ఉట్నూర్ అధికారి యువరాజ్ మార్మాట్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలు (బాలికలు), లక్షెట్టిపేట, జన్నారం గిరిజన ఆశ్రమ పాఠశాలలు( బాలూరు) లను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం, ఇతర సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలలో, వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు, మెనూ ప్రకారం భోజనం పంపిణీ, ఆహారం రుచి, మెనూ అమలు వివరాలు తెలుసుకొని, తరగతి గదిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు వండిన ఆహారం రుచిని తెలుసుకొని, కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించి, ఆరోగ్య కార్యకర్తలతో లతో ఐ.టి.డి.ఎ. పల్స్ యాప్ పని తీరుపై ఆరా తీశారు. పల్స్ యాప్ పై ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని ప్రిన్సిపల్, సంక్షేమ అధికారి, కామాటీ, వంట పని వారు, పారిశుద్ధ్య, మల్టీపర్పస్ వర్కర్లకు సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి రోజు వంటగది, స్టోర్ రూమ్, త్రాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి బడ్జెట్ సమావేశంలో కార్పొరేటర్ శ్రవణ్ ప్రసంగం

**●జిహెచ్ఎంసి బడ్జెట్ సమావేశంలో కార్పొరేటర్ శ్రవణ్ ముఖ్య అంశాలపై సూటి ప్రశ్నలు**

మల్కాజిగిరి భారతీయ వెలుగు న్యూస్

ఫిబ్రవరి 03



జిహెచ్ఎంసి మూడు కార్పొరేషన్ల గా విభజిస్తారని పూర్తిగా వార్తలొస్తున్న నేపథ్యంలో ఉద్యోగులను కూడా అదే స్థాయిలో కేటాయింపులు జరుగుతున్నటువంటి నేపథ్యంలో సింగిల్ కార్పొరేషన్ కి బడ్జెట్ పెట్టడం ఎంతవరకు సమంజసం ఒకవేళ మూడు కార్పొరేషన్ల విభజిస్తే ఈ బడ్జెట్ను ఏ విధంగా మూడు కార్పొరేషన్లకు పంచుతారుబడ్జెట్ పుస్తకంలో అనేక అవాస్తవాలు పొందుపరిచారు 20 సంవత్సరాలుగా ఆస్తి పన్ను నగరంలో పెంచలేదంటూ రాయడం పూర్తిగా అవాస్తవం. 100 రూపాయల టాక్స్ కు 10000 రూపాయలు వసూలు చేస్తున్నటువంటి పరిస్థితులు ఈరోజు నగరంలో ఉన్నాయి జిహెచ్ఎంసి సేవలు కూడా ఆ స్థాయిలోనే ఉండాలని కోరుతున్నాం.బడ్జెట్ పుస్తకంలో జిహెచ్ఎంసి ఆస్తులకు అప్పులకు సంబంధించినటువంటి ఆర్థిక వివరాలు పూర్తిస్థాయిలో పొందుపరచలేదు, అదేవిధంగా నూతనంగా మార్చి చేసినటువంటి 25 అర్బన్ లోకల్ బాడీస్ లకు సంబంధించి ఆస్తుల అప్పుల వివరాలను కూడా పూర్తిస్థాయిలో పొందుపరచడం జరగలేదు, జయ అంచనాలను పొందుపరచడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను డేటా సైన్స్ ను వాడుంటే బాగుండేది.జిహెచ్ఎంసి లో తొందర్లోనే 200 పైగా ఉద్యోగులు రిటైర్ ఐతున్నటువంటి నేపథ్యంలో జిహెచ్ఎంసి స్థాయి కూడా పెరుగుతున్నటువంటి పరిస్థితులలో 10 సంవత్సరాలు పైగా పనిచేస్తున్నటువంటి ఔట్సోర్సింగ్ సిబ్బందిని పూర్తిస్థాయిగా పర్మెంటు గా నియమించుకోవడం జరగాలి. వారందరికీ జీతభత్యాలను మున్సిపాలిటీలకు ఏ విధంగా రాష్ట్ర ఖజానా నుంచి చెల్లిస్తున్నారు అదేవిధంగా జరగాలి.10 ఫ్లోర్లు పైగా కడుతున్నటువంటి బడా బిల్డర్ లందరినీ సంబంధించి బిల్డింగ్ పర్మిషన్ ఫీజులను, ఇంపాక్ట్ ఫీజులను హెచ్ఎండిఏ ద్వారా మాత్రమే చేయాలన్నటువంటి ప్రభుత్వ ప్రతిపాదనని విరమించుకోవాలి జిహెచ్ఎంసి నడ్డి విరిచి జిహెచ్ఎంసి ఆదాయాన్ని గద్దల తన్నుకుపోయి ప్రయత్నాన్ని మానాలిబడ్జెట్ పుస్తకంలో అనేక పేజీలను పాత బుక్ లోంచి చింపి కొత్త పుస్తకంలో పెట్టినట్టుగా ఉంది హెచ్ సిటీ పేరుతో ప్రభుత్వం చేస్తున్న పనులకు ఇవ్వాల్సిన గ్రాండ్లు ఇప్పటివరకు జిహెచ్ఎంసికి అందకపోవడం శోచనీయం. కేంద్ర ప్రభుత్వము చెవుల పునర్దీకరణ కోసము ఇస్తున్నటువంటి గ్రాండ్లను ఖర్చు పెట్టాలి. గ్రీన్ బడ్జెట్ కోసం కేటాయించిన 10 శాతం నిధులలో ఓపెన్ జిమ్ము పార్కుల అభివృద్ధి త్వరితగతిన చేపట్టాలి, గత కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసిన విధంగా రెండు కోట్ల పూర్తి నిధులను కార్పొరేటర్లకు వెంటనే కేటాయించాలంటూ ఈ ముఖ్య అంశాలు పై నిలదీసిన మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్

# అల్విన్ కాలనీ డివిజన్ సమస్యలపై పాదయాత్ర చేసిన కార్పొరేటర్



భారతీయ వెలుగు న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి ఫిబ్రవరి 4

124 అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని అంబేద్కర్ నగర్, సుభాష్ చంద్రబోస్ కాలనీ, గణేష్ నగర్, తారకరామ్ నగర్ కాలనీలలోని పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు మరియు కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలలో కొంతమేర డ్రైనేజీ మరియు సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కాలనీ లో మంజీరా వాటర్ ప్రెషర్ లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీ మహిళలు కార్పొరేటర్ కి తెలియచేయగా కార్పొరేటర్ సంబంధిత జలమండలి అధికారులతో మాట్లాడి త్రాగు నీటి ప్రెషర్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పాదయాత్ర లో భాగంగా తారకరామ్ నగరలోని అంగనివాడి కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు అందిస్తున్న భోజనం మరియు వసతుల గురించి సిబ్బందితో మాట్లాడి విచారణ చేసారు. కాలనీలలో ఉన్న ప్రతీ సమస్యను నోట్ చేసుకుని పరిష్కరించాలని అధికారులకు తెలియచేశారు.

కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, బోయకిషన్, షేక్ బీబీ, సంతోష్ ముదిరాజ్, సమ్మద్, జగదీష్, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్, ఖలీమ్ మరియు కాలనీ వాసులు జి.ఎచ్.ఎమ్.సి అధికారులు వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, యు బి డి నాగరాణి, వాటర్ వర్క్స్ సూపర్వైజర్లు శ్రీనివాస్ మరియు శివ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

భారతీయ వెలుగు న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి ఫిబ్రవరి 4



124 డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామారం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో నిత్యం ట్రాఫిక్ సమస్య తో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు అని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టడం జరుగుతుందని, విస్తరణ పనులు వేగంగా చేసి ఎల్లమ్మబండ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తొలగిస్తామని అన్నారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న ఎలక్ట్రికల్ స్థంబాలను త్వరితగతిన స్థాన భ్రంశం చేయాలని, అదేవిధంగా రోడ్డు డివైడర్ మధ్యలో సుందరికరణ పనులు చేపట్టాలని, మౌలిక వసతుల కల్పనలో అలసత్వం ప్రదర్శించకుండా రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, గోపాల్, పోశెట్టిగౌడ్, సుధాకర్, ఎ.ఇ యుగంధర్ రెడ్డి, యు బి డి నాగరాణి,వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

Publishers Gunnala lavanya Printers VASISTA PRINTERS Pothuganti Rajanna, 18-97#306, 3rd Floor, Rajini gandha Complex , kamala Nagar, Chaitanyapuri, Rangareddy, Telangana, 500060 Aditar Gunnala Anilreddy Phone 9642844456, 9705043131